కూసు'మంచి పాఠశాల'



- జిల్లాలో అత్యధిక విద్యార్థులున్న సర్కారు బడిగా గుర్తింపు
- పదో తరగతి ఫలితాల్లోనూ అగ్రస్థానం 6

ఖమ్మం జిల్లా రవాణాశాఖలో పాలన గాడి తప్పుతోందా? కార్యాలయాల నుంచి చెక్‌పోస్టుల వరకు కొందరు అధికారుల వ్యవహారశైలి ఇష్టారాజ్యంగా సాగుతోందా ? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. గత కొంతకాలంగా రవాణాశాఖలోని ఉన్నతాధికారి స్థానంలో రెగ్యులర్ అధికారి లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఏడాది ఫిబ్రవరిలో ఆర్టీవోగా బాధ్యతలు చేపట్టిన అఫ్రీన్ సిద్ధిఖీ సుమారు ఐదు నెలలపాటు కార్యాలయంలో వసూళ్లకు తావులేకుండా పాలన అందించారు. ఆ తర్వాత జులైలో ఆమె సెలవుపై వెళ్లారు. అనంతరం డిసెంబరులో ప్రమోషన్ రావడంతో పూర్తిస్థాయిలో బదిలీపై వెళ్లారు. కాగా నాటినుంచి ఇప్పటివరకు రవాణాశాఖకు రెగ్యులర్ అధికారి లేకపోవడం గమనార్హం. కాగా నెలల తరబడి ఉన్నతాధికారుల అజమాయిషీ లేకపోవడంతో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇన్'చార్జి' పాలనలో పెద్ద ఎత్తున వసూళ్ల వ్యవహారం సాగిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా సోమవారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లాకు రానున్న తరుణంలో దీనిపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.



- ఉదయం 'కోడ్'.. సాయంత్రం 'లెక్క'
- పెద్దమొత్తంలో సాగుతున్న వసూళ్ల పర్వం
- పెత్తనమంతా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనే
- ఎఫ్ఐఆర్ రిలీజ్ ఆర్డర్లపైనా వారిదే అజమాయిషీ
- జిల్లా రవాణాశాఖలో గాడితప్పుతున్న పాలన
- నేడు జిల్లాకు రవాణాశాఖ మంత్రి పొన్నం

ఇన్'చార్జి' పాలన!

ఖమ్మం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణశాఖ కార్యాలయంలో పైసలు లేనిదే పని జరగడం లేదని కొందరు వాహనదారులు వాపోతున్నారు. ఆర్టీవో కార్యాలయానికి వెళ్తే ఏ పని కావాలన్నా ముందుగా ఓ ప్రైవేటు వ్యక్తిని ప్రసన్నం చేసుకోవాల్సిందేనన్న ప్రచారం జరుగుతోంది. వాహనదారులు నేరుగా వెళ్తే కాని పని సైతం.. అధికారులకు చెందిన ప్రైవేటు వ్యక్తులను కలిసి వారికి ముట్టజెప్పాల్సింది ముట్టజెబితే మాత్రమే సంతకాలు పూర్తవుతాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనిని బట్టి పైసలు వసూలు చేసే కార్యక్రమం నుంచి వాహనాల తనిఖీల వరకు అంతా ఆయా అధికారులకు చెందిన ప్రైవేటు వ్యక్తులే చూసుకుంటారన్న విమర్శలున్నాయి. ఇకపోతే ఏజెంట్ల ద్వారా నడిచే ఫైళ్లలో అయితే అందినకాడికి దండుకోవడం ఆనవాయితీగా మారినట్టు సమాచారం. ప్రతీ ఫైలుపై కోడ్ వేయడం నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధికారి దగ్గరకు వెళ్లే ఫైళ్ల మీద కోడ్‌లు వేయడం.. సాయంత్రం అవగానే ఆయా కోడ్‌ల లెక్కలు కూడి వసూళ్లు చేసి వాటిని అధికారులకు అప్పగించడం షరామామూలేనని ఆ శాఖలోని కొందరు సిబ్బందే చెబుతుండడం గమనార్హం. అసలు కార్యాలయంలో వ్యవహారాలు మొత్తం ప్రైవేటు వ్యక్తులే చక్కబెడుతుండం కొసమెరుపు. కిందిస్థాయి సిబ్బంది, ఇతర కార్యాలయాల్లోని అధికారులపై సైతం ఆయా ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆయా వ్యక్తులు, అధికారులు తమతో ఉన్నా లేకున్నా, వారే వాహనాలు ఆపి వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. అలా కేవలం జిల్లా ప్రధాన కార్యాలయంలో చేసే అక్రమ వసూళ్లే రూ.లక్షల్లో ఉంటుందంటే వసూళ్ల వ్యవహారం ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. కాగా ఇదే రీతిలో ఇతర రవాణాశాఖ కార్యాలయాల్లోనూ వసూళ్ల వ్యవహారం కొనసాగుతోన్న ఆరోపణలు ఉన్నాయి.

ఒక్కోదానికి ఒక్కో రేటు

వాహనాల రిజిస్ట్రేషన్ నుంచి మొదలుకుని డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్‌నెస్‌లు, వాహనాల బదిలీలు ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కోదానికి ఒక్కో రేటు నిర్ణయించి మరీ కోడ్ వేసి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇద్దరు అధికారుల హోదాలో సంతకాలు చేయాల్సి వస్తే ఒక రకమైన రేటు వసూలు చేయడం పరిపాటిగా మారింది. వ్యవసాయ ట్రాక్టర్‌కు/ట్రైలర్‌కు రూ.2,200, ఎక్స్‌కవేటర్, హార్వెస్టర్, లారీకి రూ.4,400, ట్రాక్టర్ లేటు రిజిస్ట్రేషన్‌కు, మోటారు క్యాబ్‌కు రూ.1,100 లెక్కన అనధికారిక వసూళ్లు సాగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. లైసెన్సుల విషయానికొస్తే వాహనం నడపడం వస్తే ఓ రేటు, రాకపోతే మరో రేటును నిర్ణయించినట్టు తెలుస్తోంది. వాహనం నడపకపోతే టూ ప్లస్ ఫోర్‌కు రూ.1,000, 2, 3, 4 వీల్స్ వాహనాలైతే రూ.1,400, 2, 3, 4, 6 అయితే రూ.2వేలు అధికారులకు సమర్పించుకోవాలని కొందరు ఏజెంట్లు తమ దగ్గరకి వచ్చిన వాహనదారులకు నేరుగానే చెబుతున్నారు. ఫిట్‌నెస్‌లలో కారుకు రూ.450, ఎల్‌జీవీ గూడ్స్‌కు రూ.550, ఆటో రూ.250, డీసీఎం రూ.వెయ్యి, లారీకి రూ.1,600 వసూలు చేస్తుండగా వాహనం ఆల్ట్రేషన్‌కు సంబంధించి రూ.1,450 అప్పజెప్పనిదే ఫైలు కదలని పరిస్థితులు జిల్లా ఆర్‌టీవో కార్యాలయంలో నెలకొన్నట్లు తెలుస్తోంది. ఇవన్నీ ఒక ఎత్తయితే యక్సిడెంట్ అయిన వాహనాలకు సంబంధించి ఎఫ్ఐఆర్ రిలీజింగ్ ఆర్డర్ ఇవ్వాలంటే వారి నోటికి మొక్కాల్సిందేనంటూ కొందరు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాన్ని బట్టి బేరాలు ఆడి అందినకాడికి దండుకున్న తర్వాతనే ఆర్డరు కాపీ చేతిలో పెడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాటికి సంబంధించిన తనిఖీకి సైతం ప్రైవేటు వ్యక్తులే వెళ్లడం శోచనీయం.



రోడ్డుపై వాహనాలు ఆపుతున్న ఓ ప్రైవేటు వ్యక్తి

శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత

ఖమ్మం జిల్లా రవాణాశాఖలో సిబ్బంది కొరత వేధిస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. రెగ్యులర్ ఆర్టీవో లేకపోవడంతో ఎంవీఐకే ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించడం, ఆయన సెలవులో వెళ్లిన సమయంలో మరోప్రాంతం నుంచి ఎంవీఐ వచ్చి ఇక్కడ విధులు నిర్వర్తించాల్సి రావడం వంటి ఘటనలు నిత్యం ఇబ్బందికరంగా మారాయి. అంతేకాకుండా ఇంచార్జ్ స్థానంలో ఉన్న అధికారి సైతం రెండు రకాల విధులు నిర్వర్తించడం కూడా కష్టతరంగానే ఉంటుంది. జిల్లాలో రెండు ఎంవీఐలు, ఆరు ఏఎంవీఐల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో ఒకరిద్దరు కూడా అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్నవారే ఉన్నారు. అంతేకాక అసలు రెగ్యులర్ ఆర్‌టీవో పోస్టు అజమాయిషీగా ఉండే స్థానం కావడం అందులో ఇంచార్జ్ పాలన సాగుతుండటంతో పూర్తిస్థాయిలో దృష్టిసారించని పరిస్థితులు నెలకొన్నాయన్న వాదన వినిపిస్తోంది. కాగా మంత్రులు, రవాణాశాఖ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి శాఖను చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.



స్వామి వారికి జేష్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

రేపటి నుంచి జ్యేష్టాభిషేక

మహోత్సవాలు

11న నిత్య కల్యాణాల నిలిపివేత

భద్రాచలం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం జ్యేష్టాభిషేక మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గోదావరి నుంచి తీర్థ బిందెతో నీటిని తీసుకొచ్చి యాగశాల వద్ద ఉత్సవ అంకురార్పణ చేపట్టనున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే జ్యేష్టాభిషేకంలో పాల్గొనే వైదిక సిబ్బందికి ఆలయ అధికారులు దీక్షా వస్త్రాలను అందజేస్తారు. బుధవారం 81కలశాలతో స్వామివారికి అభిషేకం(స్నపనం) నిర్వహించనున్నారు. కాగా జేష్టభిషేకాన్ని పురస్కరించుకుని బుధవారం భద్రాద్రి శ్రీసీతారాముల నిత్యకల్యాణాన్ని నిలిపివేయనున్నారు.

శిథిల భవనాలు.. పొంచి ఉన్న ప్రమాదాలు

- కూలిపోయే దశలో అంబేద్కర్ కాలనీ ఇళ్లు
- భయం భయంగా నివాసం ఉంటున్న ప్రజలు

వివరాలు : 6లో



జెడ్డీ కట్టి గర్భిణిని మోసుకెళుతున్న గ్రామస్థులు

గర్భిణికి ప్రసవ వేదన

- రహదారి లేక గ్రామానికి చేరుకోని 108 వాహనం
- జెడ్డీ కట్టి 3 కిలోమీటర్లు మోసుకెళ్లిన వైనం
- భద్రాద్రి జిల్లా ఉమేష్ చంద్రనగర్‌లో ఘటన

పినపాక, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పాలకుల మారుతున్నా ఏజెన్సీలో గిరిజనుల తలరాతలు మాత్రం మారడం లేదు. ఒకపక్క పాలకులు అభివృద్ధి ఉపన్యాసాలు ఇస్తున్నా మరోవైపు గిరిజన ప్రాంతాల్లో ప్రజలు కష్టాల కడిలిలోనే కొట్టుమిట్టాడుతున్నారు. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమే ఈ ఘటన.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం టి కొత్తగూడెం పంచాయతీ పరిధిలోని ఉమేష్‌చంద్ర నగర్‌లో ఆదివారం ఓ గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు తీవ్ర అవస్థలు పడ్డారు. వలస ఆదివాసీ గ్రామానికి చెందిన గర్భిణి జానకికి ఆదివారం పురిటి నొప్పులు రావడంతో భర్త సమ్మయ్య 108 అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. అయితే గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో 108వాహనం మూడు కిలోమీటర్ల దూరంలో నిలిచిపోయింది. దాంతో కుటుంబ సభ్యులు గర్భిణిని జెడ్డీ కట్టి మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడి నుంచి మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించిన తరువాత ఆమె రక్తహీనతతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించిన వైద్యులు వెంటనే జానకిని మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం జానకి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు శృతి తెలిపారు.

విపత్తులపై యుద్ధానికి సిద్ధం

- గతేడాది తీవ్ర నష్టాన్ని మిగిల్చిన వరదలు
- ఇప్పటికీ కోలుకోని వందలాది కుటుంబాలు
- మున్నేరు ముంపుపై ఈ ఏడాది ముందస్తు కార్యాచరణ
- ప్రతిడివిజన్‌లో విపత్తు సంఘాలు, అవగాహన సదస్సులు
- 160మంది అపదమిత్రాలు, ముందస్తు పునరావాసకేంద్రాల ఏర్పాటు
- పక్కాప్రణాళిక రూపొందించిన అధికారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గత ఏడాది సెప్టెంబరు 1న మున్నేరు పరివాహకంలోని ప్రజలకు కాళరాత్రి.. ఆ రోజు గుర్తొస్తే ఇప్పటికీ కొందరు బాధితులకు కన్నీళ్లు ఆగవు... కేవలం గంటల వ్యవధిలో వచ్చిన వరద వందలాది మంది నిరాశ్రయులను చేసింది. కనీసం కట్టుబట్టలు, ఆహారపదార్థాలు, అత్యవసర మందులు, సామగ్రిని బయటకు తీసుకొనే అవకాశం ఇవ్వలేదు. నివాసాల్లోకి ప్రవేశించిన వరద ఇంటి పైకప్పులను సైతం లేపేయడంతో ఇళ్లల్లోని సామగ్రి మొత్తం వరదల్లో కొట్టుకుపోయింది. ఈ ఘటన జరిగి పది నెలలైనా ఇంకా బాధిత కుటుంబాలు కోలుకోలేదు. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం మున్నేరు వరద రక్షణ చర్యలపై అధికారులు ముందస్తు కసరత్తు ప్రారంభించారు. గతేడాది వరద ముంపు అంచనాలతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఈ సంవత్సరం ముందస్తు కార్యచరణ చేశారు. మున్నేరు పరివాహకంలోని ముంపుకు గురైన 16, 17, 28, 29, 30, 34, 35, 46, 47, 48, 59, 60 డివిజన్లపై విపత్తుల నివారణ, ముందస్తు చర్యలపై నెల రోజులుగా పలు కీలకమైన అంశాలపై సమావేశాలు నిర్వహించారు. విపత్తుల సహాయక బృందాలను నియామకం చేశారు. ప్రాణ, భారీ ఆస్తి నష్టాలు జరగకుండా కార్యచరణ చేశారు.



కలెక్టర్ నుంచి నియామక పత్రాలు తీసుకుంటున్న ఆపద మిత్రాలు

పునరావాస కేంద్రాలపై ముందస్తు అవగాహన

ఏ క్షణంలో మునేరుకు వరద ముంపు వచ్చినా వెంటనే పునరావాస కేంద్రాలకు ప్రజలు వెళ్లేందుకు మూడు నెలలు ముందుగానే విపత్తుల పునరావాస కేంద్రాలను అధికారులు గుర్తించి ప్రకటించారు. గతేడాది వరదల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని సమీపంలోని మైదాన ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడే అత్యవసర వైద్యసేవలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల నుంచి సాధారణ వ్యాధుల వరకు మందులను ఉంచటంపై కార్యాచరణ (మిగతా 6వ పేజీలో)



ముంపు ప్రాంతాల ఉద్యోగులకు విపత్తులపై అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ కమాండర్ గౌతమ్

ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో అవగాహన సదస్సులు

విపత్తుల సమయంలో ప్రతి వ్యక్తి తనకు తాను రక్షించుకోవటంపై అవగాహన ఉంటే ప్రాణ నష్టంతో పాటు చాలా మేరకు ఆస్తి నష్టం తగ్గించవచ్చు. అందుకే మున్నేరు పరివాహక ప్రాంతంలోని ముంపు ప్రభావిత ప్రజలకు జాతీయ విపత్తు బృందాలు(ఎన్డీఆర్ఎఫ్)తో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. మొక్కుబడిగా కాకుండా డివిజన్లు వారీగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మొత్తం 15రోజులు పాటుగా ప్రజలకు, స్థానికంగా ఉన్న యువతకు క్షేత్రస్థాయిలోని ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలకు అవగాహన కల్పిస్తున్నారు.



సాగుకు సమాయత్తం

- దుక్కిదున్ని విత్తనాలు పెడుతున్నరైతులు
- తొలకరి వర్షాలపై ఆశలు

వివరాలు : 7లో

పుష్కర సన్నద్ధత ఏదీ ?



2015 పుష్కరాల్లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి తుమ్మల

- గోదావరి పుష్కరాలపై ముందు చూపు కరువు
- దీర్ఘకాలిక ఏర్పాట్లపై దృష్టిపెట్టని ప్రభుత్వం
- ఏపీలో ఇప్పటికే ముందస్తు ఏర్పాట్లపై కసరత్తు
- 2027 జూలైలో గోదావరి పుష్కరాలు
- గత రెండు పుష్కరాల ఏర్పాట్లలో మంత్రి తుమ్మల మార్క్

భద్రాచలం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఉత్తరభారతదేశంలో కుంభమేళాకు ఎంతటి ప్రాధాన్యం ఉంటుందో దక్షణాదిన గోదావరి పుష్కరాలకు అంతటి ప్రాధాన్యత ఉంటుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో గోదావరి పుష్కరాలకు ఎంతో ప్రముఖ్యత ఉంది. ఈ పుష్కరాల్లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు దేశవ్యాప్తంగా కోట్ల మంది భక్తులు తరలివస్తారు. అంతటి ప్రాధాన్యం కలిగిన గోదావరి పుష్కరాలకు మరో రెండేళ్ల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పుష్కరాల ఏర్పాట్లపై దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైంది. ముఖ్యంగా దీర్ఘకాలంలో చేపట్టాల్సిన రహదారుల విస్తరణ, ఆలయాల అభివృద్ధి, గోదావరి ఒడ్డున్న అదనపు స్నానఘట్టాల నిర్మాణాలు, (మిగతా 6వ పేజీలో)



ఖమ్మంలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

మృగశిర ఆరంభం.. చేపల సంబురం

- వినియోగదారులతో చేపల మార్కెట్లలో సందడి
- భారీగా పెరిగిన చేపలు, నాటుకోడి ధరలు

వివరాలు : 6లో

శిథిల భవనాలు.. పొంచి ఉన్న ప్రమాదాలు

- కూలిపోయే దశలో అంబేద్కర్ కాలనీ ఇళ్లు
- భయం భయంగా నివాసం ఉంటున్న ప్రజలు
- ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా?
- వర్షం వస్తే సహాయ కేంద్రాలకే..





పాతకొత్తగూడెంలోని అంబేద్కర్ కాలనీలో శిథిలావస్థకు చేరిన ఇళ్లు

కొత్తగూడెం టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వర్షం వచ్చిందంటే ఆ కాలనీ ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కు అంటూ జీవనం సాగిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన గృహాల్లోనే నివాసం ఉంటూ దిన దినగండంగా మారింది. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని పాత కొత్తగూడెం సమీపంలోని అంబేద్కర్‌కాలనీ వాసుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రతి ఏడాది వర్షాకాలంలో వర్షాలు రావడం వర్షాలకు ఇళ్లు కురుస్తుండటంతో మునిసిపల్, రెవెన్యూ అధికారులు ఆ ప్రాంత ప్రజలను సమీపంలోని పాత కొత్తగూడెంలోని ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది.

వర్షం వచ్చి వరదలు వస్తే సహాయ కేంద్రాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం, పక్కా ఇళ్లు నిర్మిస్తామని హామీలు ఇవ్వడం.. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత సహాయ కేంద్రాల నుంచి ఇళ్లకు పంపే పని తప్ప తమకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన చెందుతున్నారు. సహాయ కేంద్రాల్లో 10, 15 రోజులు ఉండటం తర్వాత శిథిలావస్థలో ఉన్న గృహాల్లోకి తరలివెళ్లడంతో సరిపోతుందని వ్యాఖ్యానిస్తోన్నారు.

1983లో ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు సుమారు 30మందికి పైగా పక్కా గృహాలను నిర్మించినట్లు స్థానికులు తెలిపారు. 30 సంవత్సరాలు పైబడిన ఇళ్లు కావడంతో శిథిలావస్థకు చేరి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. వర్షం వస్తే ఇంటి పై కప్పు నుంచి నీరు వచ్చి ఇంట్లో ఉన్న సామగ్రి తడిచి పోతున్నాయని బాధితులు ఆవేదన చెందుతున్నారు. తాత్కాలిక మరమ్మతులు చేసుకుని కవర్లు కప్పుకుని వర్షం రాకుండా జాగ్రత్తపడుతున్నామని ఏ క్షణంలోనైనా నీటికి నానిన ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని ఆ ప్రాంత ప్రజలు భయపడుతున్నారు. ప్రమాదం జరిగితేనే అధికారులు, ప్రజాప్రతినిధులు హడావిడి చేస్తారు తప్ప తమ బాగోగులను ఎవరు పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు.

పేదలకు పక్కా గృహాలు నిర్మిస్తామని ప్రచారం చేస్తున్న పాలకులు తమ గోడు పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరిగినప్పటికీ తమకు గూడు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం వస్తుందంటే బిక్కుబిక్కున జీవనం సాగిస్తున్నామని తమకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు డబల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

శిథిల భవనాల్లో ఉంటున్నాం..
గుర్రం సునీత



శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లోనే నివాసం ఉంటున్నాం. అత్తా, మామలు ఎప్పటి నుంచో ఉంటున్నారు. మేము సైతం పిల్లా పాపలతో ఇక్కడే నివాసం ఉంటున్నాం. వర్షాకాలం వచ్చిందంటే భయం.. భయంగా జీవనం సాగించాల్సి వస్తుంది. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు ఎప్పుడు కూలుతాయోనని భయంగా ఉంది.

డబుల్‌బెడ్‌రూంలు కేటాయించాలి
భవాని ప్రసాద్



సహాయ చర్యల కంటే ముందుగానే ప్రభుత్వం డబల్‌బెడ్ రూం కేటాయించాలి. వర్షాకాలంలో అంబేద్కర్‌నగర్‌కాలనీ ప్రజల పరిస్థితి దయనీయంగా ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారికి శాశ్వత పరిష్కారం చూపాలి.



కూసు‘మంచి పాఠశాల’

- ఖమ్మం జిల్లాలో అత్యధిక విద్యార్థులున్న సర్కారు బడిగా గుర్తింపు
- పదో తరగతి ఫలితాల్లోనూ అగ్రస్థానం
- ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలకోసం ఉపాధ్యాయుల ప్రచారం

కూసుమంచి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 946 మంది విద్యార్థులున్న సర్కారు బడిగా కూసుమంచి జడ్పీ ఉన్నత పాఠశాల గుర్తింపు పొందింది. విద్యార్థుల సంఖ్యలోనే కాకుండా పది ఫలితాల్లోనూ కొన్నేళ్లుగా మేటిగా నిలుస్తోంది. మరి కొన్ని రోజుల్లో కొత్త విద్యాసంవత్సరం మొదలవుతున్న సందర్భంగా విద్యార్థులకు ఆహ్వానం పలుకుతోంది. ఈనెల 15వరకు బడిబాటను నిర్వహించనున్నారు. వేసవి సెలవుల్లోనే విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు శిబిరాలు నిర్వహించిన ఉపాధ్యాయులు, అదేసమయంలో విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తూ ప్రచారం నిర్వహించారు.



కూసుమంచిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కార్పొరేట్ స్థాయిలో ప్రచారం

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు తీర్చిదిద్దారు. వాటిని అందిపుచ్చుకుని అత్యుత్తమ ఫలితాలు పొందుతూ నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఫలితాల్లో తగ్గేది లేదంటూ ఉపాధ్యాయులు వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పాఠశాల ప్రత్యేకతలను తెలుపుతూ విద్యార్థులను తీర్చిదిద్దే తీరును తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోకుండా పెంచేవిధంగా ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రచారబాట పట్టారు. సోషల్‌మీడియా వేదికగా పోస్టర్‌లు పోస్ట్ చేస్తున్నారు. కరపత్రాలు పంచి పెడుతున్నారు. అర్హులైన టీచర్లతో విద్యాబోధన, ఉచితంగా పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, ఉన్నత విద్యలో అవకాశాలు వంటి వసతులను వాట్సాప్ గ్రూపుల ద్వారా నిత్యం ప్రచారం నిర్వహిస్తున్నారు. పాఠశాల ఘనత, ఉత్తీర్ణతాశాతం, ఉపాధ్యాయుల హోదా, సాధించిన విజయాలతో ప్రచారం నిర్వహిస్తున్నారు.



కూసుమంచి పాఠశాల ముఖద్వారం

పాఠశాలలో సకల సౌకర్యాలు

కూసుమంచి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలను అభివృద్ధి చేశారు. సుమారు రూ.5కోట్ల వ్యయంతో పలు విడతల వారీగా భవనాలను నిర్మించారు. కార్పొరేట్ స్థాయిలో గదులు, బల్లలు, టాయ్‌లెట్స్ నిర్మాణాలు చేశారు. పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సొంత నిధులతో తాగునీటి ఫిల్టర్ నిర్మించారు. మన ఊరు-మనబడి కార్యక్రమంలో వంటగదులు, ప్రహరీ నిర్మించారు. సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో ఆటస్థలం ఉంది. పాఠశాల మొదలవగానే కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించనున్నారు.

ప్రవేశాలు పెంచడమే లక్ష్యం
రాయల వీరాస్వామి, ఎంఈవో, హైస్కూల్ హెచ్ఎం



ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది. ప్రచారలోపం కారణమని భావిస్తున్నాం. అందుకోసం నూతన పద్ధతుల్లో తల్లిదండ్రులను కలుస్తూ ప్రచారం నిర్వహిస్తున్నాం. ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.



బడిబాట పోస్టర్

భద్రాద్రితో మాగంటి గోపీనాథ్‌కు అనుబంధం

‘భద్రాద్రి రాముడు’ సినిమాకు నిర్మాతగా రాక



పర్ణశాల సీతా కుటీరం వద్ద మాగంటి (ఫైల్)

భద్రాచలం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హైదరాబాద్‌లో ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే మాగంటి గోపీనాథ్‌కు భద్రాచలంతో విడదీయరాని బంధం ఉంది. గతంలో భద్రాద్రి రాముడు అనే సినిమాను నిర్మించగా ఇక్కడే చాలా వరకు సినిమాలోని సన్నివేశాలను చిత్రీకరించారు. ఇదిలా ఉండగా తెలుగుదేశం పార్టీ నాయకులుగా గతంలో ఉన్న క్రమంలో ఆయన భద్రాచలం వచ్చినప్పుడు ప్రతి సందర్భంలో అక్కడి టీడీపీ నాయకులు ఆయనను కలిసేవారు. పలుమార్లు భద్రాచలం, పర్ణశాల ఆలయాల సందర్శన నిమిత్తం ఆయన భద్రాచలం వచ్చారు. ఈ క్రమంలో హఠాత్తుగా మాగంటి గోపీనాథ్ మృతి చెందడం పట్ల తెలుగుదేశం పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ కమిటీ సభ్యులు కొడాలి శ్రీనివాసన్, కంభంపాటి సురేష్, కుంచాల రాజారామ్, సొసైటీ చైర్మన్ అబ్బినేని శ్రీనివాస్, తాళ్లూరి చిట్టిబాబు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు.

‘కారు’చౌక బేరం



మల్లవరం హాస్టల్ ఆవరణలో కార్లు

తల్లాడ, జూన్8 (ఆంధ్రజ్యోతి): కార్లలో చిరు వ్యాపారం చేస్తూ సంచార కుటుంబాల వారు జీవనోపాధి పొందుతున్నారు. తల్లాడ మండలం మల్లవరం గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహం వద్ద మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రాంతానికి చెందిన సంచార కుటుంబాల వారు డేరాలతో తాత్కాలిక నివాసం ఏర్పరుచుకున్నారు. ఆయా కుటుంబాల వారు కార్లలో తల్లాడ పరిసర ప్రాంతాల్లో సగం ధరకే ఎల్ఈడీ బల్బులు విక్రయిస్తూ చౌకబేరం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

పుష్కర సన్నద్ధత ఏదీ ?

(5వ పేజీ తరువాయి)

భక్తులకు వసతి ఏర్పాట్లపై కసరత్తు ఇలా ఎన్నో కీలక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉన్నా ప్రభుత్వం నుంచి ఆ దిశగా కార్యాచరణ కనిపించడం లేదు. మరో వైపు ఏపీలో గోదావరి పుష్కరాలపై ఇప్పటికే అక్కడి ప్రభుత్వం ఒక విడత సమావేశం సైతం నిర్వహించి సన్నద్ధతపై ప్రణాళికలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. ఎంతో ప్రతిష్టాత్మకమైన గోదావరి పుష్కరాల్లో పుణ్య స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు దేశం నలుమూలల నుంచి తరలివచ్చే అవకాశం ఉంది. ప్రధానంగా గోదావరి నది పరివాహక ప్రాంతంలోని భద్రాచలం, బాసర, కాళేశ్వరం, ధర్మపురి, కేశవపురి, మంథని తదితర పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ఇక్కడ గోదావరిలో పుణ్యస్నానాలు, పిండ ప్రదానాల అనంతరం భక్తులు ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో 2027 జూలైలో జరిగే గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ముందస్తు ప్రణాళిక ఎంతో కీలకం

గోదావరి పుష్కరాలకు ముందస్తు ప్రణాళిక ఎంతో కీలకం. గతంలో 2015 జూలై 14 నుంచి 25 వరకు గోదావరి పుష్కరాలు నిర్వహించారు. ఆ పుష్కరాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 70 లక్షల మంది భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు కోటికి పైగా భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో భక్తులు సులభంగా గోదావరి స్నానఘట్టాలకు చేరుకునేందుకు పుణ్య క్షేత్రాలను దర్శించేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉంది. చివరి నిమిషంలో పుష్కరాల పనులను చేపట్టడం వల్ల నాణ్యత లేకపోవడం, అనుకున్న పనులు సకాలంలో పూర్తికాకపోవడం లాంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటి నుంచే దేవాదాయశాఖతో పాటు పోలీసు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి నీటిపారుదల, అగ్నిమాపక, రెవెన్యూ తదితర శాఖలతో కీలక సమీక్ష నిర్వహించి అవసరమైన పనులకు అంచనాలను రూపొందించడంతో పాటు ప్రత్యేక బడ్జెట్‌ను మంజూరు చేసి పనులను ఇప్పటి నుంచే చేపడితే పుష్కరాల సమయం నాటికి పూర్తి చేసేందుకు వెసులుబాటు ఉంటుందని భక్తులు సూచిస్తున్నారు.



2015 జూలైలో జరిగిన గోదావరి పుష్కరాల్లో స్నానాలు చేస్తున్న భక్తులు (ఫైల్)

రహదారుల విస్తరణ ఎంతో అవసరం

వివిధ నగరాలు, పట్టణాల నుంచి గోదావరి పరివాహక ప్రాంతంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న భద్రాచలం, పర్ణశాల, మోతె పుష్కర ఘాట్లకు చేరుకోవడానికి రహదారుల విస్తరణ ఎంతో అవసరం. వైరా నుంచి కొత్తగూడెం వరకు నాలుగులైన్ల రోడ్డు విస్తరణ పనులు సత్వరమే చేపట్టాల్సి ఉంది. అలాగే భద్రాచలం నుంచి పర్ణశాలకు వెళ్లే మార్గంలో సైతం విస్తరణ పనులు రహదారులను నిర్మించాలి. ఇందులో ఏపీ పరిధిలో ఉండే మేడువాయి నుంచి తూరుబాక వారధి వరకు రహదారి నిర్మాణం ఏపీ ప్రభుత్వం చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. అదేవిధంగా 2015లో నిర్మించిన స్నానఘట్టాలను మరోసారి పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించడంతో పాటు నూతనంగా మరిన్ని స్నానఘట్టాలను పెంచడం ద్వారా భక్తుల రద్దీకి తగిన విధంగా ఘాట్లను సిద్ధం చేయాలి. అలాగే ప్రధాన ఆలయాలకు ప్రత్యేక శోభను చేకూర్చేలా అభివృద్ధి పనులు, పుష్కరాలకు తరలివచ్చే భక్తులు విడిది చేసేందుకు తాత్కాలిక వసతులు, పార్కింగ్ స్థలాలు సిద్ధం చేయడంపై దృష్టి సారించాల్సి ఉంది.

గత రెండు పుష్కరాల ఏర్పాట్లలో తుమ్మల మార్క్

వరుసగా రెండుసార్లు గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు చేసిన అనుభవం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఉంది. 2003, 2015లో మంత్రిగా ఉన్న ఆయన గోదావరి పుష్కరాలకు తరలి వచ్చే భక్తులను దృష్టిలోఉంచుకొని ప్రత్యేక ఏర్పాట్లు అధికార యంత్రాంగం చేసేలా ప్రణాళికలు రూపొందించి ఆచరణలో పెట్టారు. కాగా ప్రస్తుతం రాష్ట్ర మంత్రి వర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే కసరత్తు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖలు సైతం గోదావరి పుష్కరాల ప్రాశస్త్యాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా నిధులను మంజూరు చేసి పనులు సత్వరమే పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

మృగశిర ఆరంభం.. చేపల సంబురం

- వినియోగదారులతో చేపల మార్కెట్లలో సందడి
- భారీగా పెరిగిన చేపలు, నాటుకోడి ధరలు

ఖమ్మంఖానాపురంహవేలి/లక్ష్మీదేవిపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె ఆరంభంతో ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపల సంబురం నెలకొంది. మృగశిర కార్తె రోజు చేపలు తింటే మంచిదన్న అభిప్రాయంతో ప్రజలు చేపల కొనుగోలు కోసం క్యూకట్టారు. డిమాండ్ అధికంగా ఉండడంతో వ్యాపారులు చేపల రేట్లను అమాంతం పెంచారు. గతంలో కేజీ రూ.180ఉన్న చేపలు మృగశిర కార్తెరోజు రూ.250నుంచి 600వరకు అమ్మారు. చేపల తోపాటు నాటుకోడి ధరలు కూడా పెరిగాయి. గతంలో రూ.600నుంచి రూ.700 ఉన్న నాటుకోడి ఆదివారం రూ.1200వరకు పలికింది. దీంతో గతంలో కేజీనుంచి 3కేజీలు కొనేవారు కేవలం అరకేజీతోనే సరిపెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 40నుంచి 50టన్నుల వరకు చేపల విక్రయాలు జరిగినట్టు వ్యాపారులు పేర్కొన్నారు.

ఇద్దరు చిన్నారులపై లైంగిక వేధింపులు

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

మణుగూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మణుగూరు మునిసిపాలిటీలో 55ఏళ్ల వ్యక్తి ఆదివారం స్థానికంగా ఉన్న ఆరేళ్ల, తొమ్మిదేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధిత చిన్నారుల తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మణుగూరు సీఐ సదరు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి చిన్నారి మృతి

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఖమ్మం అర్బన్ మండల పరిధిలోని అగ్రహారంలో విషాద సంఘటన నెలకొంది. చెరువుబజార్‌కు చెందిన చింతల సాంబ కుమార్తె చింతల మేఘన(3) శనివారం పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంది. మరుసటి రోజు అగ్రహారంలోని బంధువుల ఇంట్లో రిసెప్షన్ వేడుకకు వెళ్లిన తల్లిదండ్రులు చిన్నారి మేఘనను తీసుకెళ్లారు. వేడుకల సమయంలో తల్లి బిడ్డకు అన్నం తినిపిస్తూ ఆడుకున్న క్రమంలో ప్రమాదవశాత్తూ చిన్నారి బావిలో పడింది. కాగా పాపను బంధువులు బయటకు తీసి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చిన్నారిని పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో రెండు ప్రాంతాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. పాప మృతిపై మరిన్ని విషాయాలు తెలియాల్సి ఉంది.

జీవితాన్ని గెలిపించే దీపం చదువు

● డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

చుంచుపల్లి, జూన్8(ఆంధ్రజ్యోతి): జీవితాన్ని గెలిపించే దీపం చదువని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహ మాన్ అన్నారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలో గల జిల్లా గ్రంథాలయం నందు తెలంగాణ సీనియర్ సిటీజన్స్ ఆధ్వర్యంలో పది వేల రూపాయల విలువ చేసే సాధారణ వేడి, చల్లని, తాగునీరు అందించే వాటర్ కూలర్‌ను జిల్లా గ్రంథాలయానికి డీఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ చదువు జీవితాలని వెలిగించే దీపం అని, సామాన్య కుటుంబాన్ని సంపన్న కుటుంబంగా తీర్చిదిద్దుతుందన్నారు. కష్టపడి, ఇబ్బందులను ఓర్చుకుని మంచిగా చదువుకున్న వారు నేడు ఉన్నత స్థానాల్లో నిలిచారని గుర్తు చేశారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని చదివితే విజయం సాధించవచ్చు అన్నారు. కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు వంటివనీ, వాటిని సద్వినియోగం చేసుకొని వాతావరణంలో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు జి.మణిమృదుల, సీనియర్ సిటీజన్ సభ్యులు ప్రెసిడెంట్ కోట్ల నాగేశ్వరరావు, సెక్రటరీ సురేష్‌కుమార్, ట్రెజరర్ ధర్మరాజు, సభ్యులు కేశవరావు, విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి

- జూలై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె : సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్

కొత్తగూడెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను అన్నిరంగాల కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే. రమేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ లేబర్‌కోడ్‌లు అమలు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతుందని తద్వార శ్రమదోపిడిని మరింత తీవ్రతరం చేయాలని ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. అనేక పోరాటాలు, త్యాగాల ఫలితంగ సాధించుకున్న 8గంటల పని చట్టం లేబర్‌కోడ్‌ల వల్ల ఉనికిని కోల్పోతుందని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే 8గంటల పని స్థానంలో 10 నుంచి 12గంటల పనిని ప్రవేశపెట్టాయని ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 10 గంటల పని విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. జూలై 9వ తేదీన నిర్వహించే సమ్మెకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మండల కేంద్రాల్లో సమ్మె జయప్రదం కోసం సీఐటీయూ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమల్లో సమ్మె విజయవంతం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే. బ్రహ్మాచారి, జిల్లా ఆఫీస్ బేరర్స్ పిట్టల అర్జున్, గద్దల శ్రీనివాస్, కే. సత్య, ధనలక్ష్మి, ఎస్ఎ. నబీ, జిల్లాకమిటీసభ్యులు పాయం రాధాకుమారి, భూక్య రమేష్, తాళ్లూరి కృష్ణ, ఝాన్సీ, నిమ్మల మధు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్

విపత్తులపై యుద్ధానికి సిద్ధం

(5వ పేజీ తరువాయి)

పూర్తి చేశారు.

కార్పొరేటర్ ఆధ్వర్యంలో విపత్తు సంఘాలు

మున్నేరు పరివాహకంలోని ముంపు డివిజన్లకు ఆయా కార్పొరేటర్‌ల ఆధ్వర్యంలో విపత్తు సంఘాల్ని ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రూప్‌లో 20మందిని నియామకం చేశారు. వారికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో శిక్షణ ఇప్పించారు. వరదల సమయంలో తక్షణం చేయాల్సిన పనులను ముంపు వీధుల వారీగా కేటాయించారు.

160 మంది ఆపద మిత్రాలు సిద్ధం

మున్నేరు పరివాహకంలో వరదల సమయంలో ప్రజలను రక్షించేందుకు మెప్మా ఆధ్వర్యంలో డివిజన్ల వారీగా 160మంది ఆపద మిత్రాలను నియామకం చేశారు. వారికి విపత్లును ఎదుర్కొవటంపై 12రోజులు పాటుగా మహిళలకు మహిళా ప్రాంగణంలో పురుషులకు బీసీ కాలేజీ భవనంలో శిక్షణ ఇచ్చారు. కొన్ని పరికరాలను అందించారు. ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆపద మిత్రాలకు గుర్తింపు, శిక్షణ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. రెవెన్యూశాఖ గుర్తించిన 12ముంపు డివిజన్లలో అపద మిత్రాలకు ప్రాంతాల వారీగా ముందస్తు కార్యచరణ చేశారు. ఏ క్షణంలో వరదలు వచ్చినా వారికి కేటాయించిన డివిజన్‌లోని విధులకు వెళ్లి తక్షణ సహాయక చర్యల్లో పాల్గొంటారు. వీరికి టీఎంసీ, సీవోలు, ఆర్పీలు సహాయకులుగా నిలుస్తారు.



శిక్షణ పొందిన 160మంది అపద మిత్రాలు



డీఆర్ఎఫ్ లోకల్ బృందాలు

అడవుల రక్షణకు సహకారం అందిస్తాం

» ఎస్పీ రోహిత్‌రాజు


వ్యూ పాయింట్ నుంచి అడవిని వీక్షిస్తున్న ఎస్పీ

చంద్రుగొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అడువుల రక్షణకు తమవంతు సహకారం ఉంటుందని భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. ఆయన ఆదివారం కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌తో కలిసి చంద్రుగొండ మండలం బెండాలపాడు శివారులోని కనకగిరి గుట్టలను సందర్శించారు. గుట్టలపైన ఏడు కిలో మీటర్ల ఎత్తులో ఉన్న కాకతీయుల కాలం నాటి వీరభద్రుస్వామి ఆలయంలో పూ జలు చేశారు. గుడి పరిసరాల్లో ఉన్న ఆనాటి రాతి కట్టడాలను, పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన వ్యూ పాయంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రేంజ్ అధికారి ఎల్లయ్య పురాతన నిర్మాణాల చరిత్రను, విస్తారంగా విస్తరించి ఉన్న అడువుల ప్రాధాన్యతను ఎస్పీకి వివరించారు. దాంతో పాటు ఫారెస్ట్ బేస్ క్యాంపు, బెండాలపాడు సమీపంలో ఉన్న బ్యాంబో ఉత్పత్తుల పరిశ్రమను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అడువులది ప్రధాన భూమిక అయినందున అడువుల రక్షణ. సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఏదో ఒక పేరుతో అడువులను ధ్వంసం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని, అందుకు పోలీసు సహకారం తీ సుకోవాలని ఎస్పీ అటవీ అధికారులను కోరారు. ఎస్పీ వెంట చంద్రుగొండ, తల్లాడ రేంజ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వనమహోత్సవానికి సర్వం సిద్ధం

» జూలూరుపాడులో 2.64 లక్షల మొక్కల పెంపకం
» ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేసేలా ఏర్పాట్లు

జూలూరుపాడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవానికి అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షకాలం సమీపించడంతో మొక్కలు నాటేందుకు మండలపరిషత్, ఈజీఎస్ సిబ్బంది సర్వం సిద్ధం చేస్తున్నారు. హరిత వనాలు, కెనాల్ బండ్, అవెన్యూ ప్లాంటేషన్లను ఏర్పాటు చేసేందుకు స్థలాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. కాగా నర్సరీలలో పెంచిన మొక్కలు నాటేందుకు అందుబాటులోకి వచ్చాయి. జూలూరుపాడు మండలంలోని 24 పంచాయతీలలో పంచాయతీకి ఒక నర్సరీ చొప్పున ఈజీఎస్ వారీ ఆధ్వర్యంలో 24 నర్సరీలను ఏర్పాటుచేయడం జరిగింది.

పలు రకాల మొక్కలు పెంపకం

నర్సరీలలో పలు రకాల మొక్కల పెంపకాన్ని చేపట్టారు. వీటిలో వివిధ రకాలకు చెందిన ఔషధ, పండ్ల, పూలు, అటవీ జాతుల మొక్కలను పెంచారు. నిమ్మ, జామ, తులసి, కరివేపాకు, మునగ, మద్రి, తాండ్ర, కరక, మందారం, కాగితపుపూలు మొక్కలతో పాటు అటవీ జాతికి చెందిన 2.64 లక్షల మొక్కలను పెంచారు. ఒక్కొక్క నర్సరీలో 11 వేల చొప్పున మొక్కలను పెంచగా వీటిలో హోంసీడ్ రకం (పండ్ల, పూలు, ఔషధ) లకు చెందిన 6వేల మొక్కలను, మిగిలిన 5వేలు అటవీ జాతి మొక్కలు ఉన్నాయి. అన్ని నర్సరీలలో కలిపి హోంసీడ్‌కు చెందిన మొక్కలు 1.44 లక్షలు, అటవీ జాతికి చెందినవి 1.20 లక్షల మొక్కలను పెంచినట్లు అధికారులు చెబుతున్నారు.

వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మొక్కలను పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ అధికారులు మొక్కలను పంపిణీ చేసేందుకు పంచాయతీల వారీగా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. మునగ వల్ల లాభాలు ఎన్నో ఉండడంతో విధిగా ఇంటింటికి ఒక మునగ మొక్కతో పాటు నిమ్మ, జామ, తులసి, కరివేపాకు, మందారం, కాగితపు పూలు తదితర ఆరు రకాలకు చెందిన మొక్కలను ప్రజలకు పంపిణీ చేయనున్నారు. తొలిసారిగా ఈ ఏడాది నర్సరీలలో మద్రి, తాండ్రా, కరక మొక్కలను పెంచారు. అదే విధంగా ప్రభుత్వ కార్యలయాలు, పాఠశాలల్లో హరితవనాలు, కెనాల్ బండ్ ప్లాంటేషన్, రహదారుల వెంట అవెన్యూ ప్లాంటేషన్లలో వెదురు, వివిధ రకాల అటవీ జాతి, ఔషధ మొక్కలను నాటేలా ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు.

ప్లాంటేషన్ల ఏర్పాటు కోసం స్థలాల గుర్తింపులో నిమగ్నం

కెనాల్ బండ్, అవెన్యూ, హరిత వనాల ఏర్పాటుకు సంబంధించి స్థలాలను గుర్తించే పనిలో ఈజీఎస్, మండల పరిషత్ సిబ్బంది నిమగ్నమయ్యారు. మొక్కలను నాటేందుకు ఇప్పటి నుంచే గుంతలు తీస్తున్నారు. ఇంటింటికి మొక్కలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.


మాచినేనిపేట తండా నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

వర్షాలు కురవగానే మొక్కలను పంపిణీ చేస్తాం

● కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీవో జూలూరుపాడు



వర్షాలు కురవగానే గ్రామాలలోని ప్రజలకు 6 మొక్కలను పంపిణీ చేస్తాం. అదే విధంగా గుర్తించిన స్థలాలలో హరిత వనాలు, కెనాల్ బండ్ ప్లాంటేషన్‌లలో మొక్కలను నాటుతాం. వన మహోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేస్తున్నాం. ఇప్పటికే నర్సరీలలో పెంచిన మొక్కలను నాటేందుకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మదన్‌లాల్ మరణం గిరిజనులకు తీరని లోటు

» నివాళులర్పించిన ఎమ్మెల్యేలు కూనంనేని, కోరం కనకయ్య


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, బాగం హేమంతరావు

రఘునాథపాలెం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మరణం గిరిజనులకు తీరని లోటువంటిదని, మంచి నాయకుడుగా అన్ని వేళలా నియోజకవర్గ ప్రజలకు అండగా ఉన్నారని కొత్తగూడెం, ఇల్లెందు ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు. వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ సంస్మరణ సభను ఆదివారం రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో నిర్వహించారు. వామపక్ష, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున హాజరై నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


శివ(ఫైల్)

కొణిజర్ల, జూన్8(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలో శనివారం రాత్రి జరిగింది. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్లకు చెందిన బండారు శివ(23) అనే యువకుడు తనికెళ్ల సమీపంలోని జిలానికి చెందిన వెల్డింగ్‌షాపులో పని చేస్తున్నాడు. శనివారం రాత్రి పని చేస్తుండగా ఒక్కసారిగా షార్ట్‌సర్క్యూట్ జరగడంతో యువకుడు అక్క డికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే అతడిని ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి ముత్తమ్మ ఫిర్యాదు మేరకు వెల్డింగ్‌షాపు యాజమాని నిర్లక్ష్యం వలనే ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రశాంతంగా ఐసెట్ పరీక్షలు


పరీక్షలకు హాజరైన అభ్యర్థులు

కొత్తగూడెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుజాతనగర్ మండల పరిధిలో అబ్దుల్‌కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఐసెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం మొత్తం 130 మంది అభ్యర్థులకు గాను 118మంది పరీక్షలకు హాజరయ్యారు. సాయంత్రం 130మంది అభ్యర్థులకు గాను 118మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

చర్చనీయాంశంగా మహిళా ఎస్ఐపై దాడి ఘటన

» ముక్తకంఠంతో ఖండిస్తున్న పలు సంఘాలు

కల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఇటీవల విధి నిర్వహణలో ఉన్న మహిళ ఎస్ఐ హరితపై కొందరు యువకులు మద్యం మత్తులో దాడి చేయడం పట్ల సర్వత్ర చర్చినీయాంశంగా మారింది. స్థానికంగా తిరువూరు క్రాస్ రోడ్ వద్ద ఓ హోటల్‌కు వెళ్లిన కొందరు యువకులు మందుగానే చపాతీల తయారీ విషయమై మద్యం మత్తులో అకారణంగా ఘర్షణకు దిగిన విషయం విధితమే. ఈ విషయమై సదరు హోటల్ యజమాని వారిపై చర్యల నిమిత్తం ఎస్ఐ హరితకు సమాచారం అంచారు. ఘటన పట్ల స్పందించిన ఎస్ఐ హరిత హోటల్ వద్ద ఘర్షణ వాతవరణం నివారించేందుకు వెళ్లారు. ఆ సమయంలో మహిళ ఎస్ఐ ఘర్షణకు కారుకులైన వారిని విషయం తెలుసుకునేందుకు ప్రశ్నించగా, సదరు యువకుల బృదంలోని వారు ఎదురు దాడికి పాల్పడ్డారు. మహిళ అధికారి అని కూడా చూడకుండా మద్యం మత్తులోని యువకుల్లో ఒకరు అమానుషంగా చేతితో ఎస్ఐను నెట్టివేయడం జరిగింది. ఇలా విధి నిర్వహణలో ఉన్న ఓ మహిళా అధికారిపై యువకుల దాడి ఘటన కల్లూరు పరిసర ప్రాంతంలో చర్చనీయంశంగా దారితీసింది. ఈ సంఘటనపై జిల్లా పోలీసు యంత్రాంగం సీరియస్‌గా తీసుకున్నారు. మహిళా ఎస్ఐ విధులకు అటంకం కలిగించిన యువకులను వెంటనే అదుపులోకి తీసుకొని కఠినంగా మందలించటమే కాకుండా, చట్టపరంగా కూడా అనేక సెక్షన్ల కింద వారిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలో ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మహిళా ఎస్ఐపై ఘర్షణకు కారుకుడైన ప్రధాన నిందితుడు రాయల రాముపై రౌడీషీట్ కూడా తెరిచారు. కాగా ఈ సంఘటనకు కారుకులైన యువకులు ఓ రాజకీయ పార్టీలో పనిచేస్తున్నప్పటికీ వారి ప్రవర్తనపై తీవ్రంగా ఖండిస్తూ వారిని శిక్షించాలని ముక్తకంఠంతో అధికారులను కోరుతున్నారు.

ఎస్ఐపై దాడి పట్ల మాజీ ఎమ్మెల్యే సండ్ర ఖండన

కల్లూరు ఎస్ఐ హరితపై కొందరు యువకులు దాడికి పాల్పడటం పట్ల సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న మహిళ ఎస్ఐను తల్లాడకు చెందిన కొందరు యువకులు మద్యం మత్తులో దురుసుగా ప్రవర్తిస్తూ దాడి చేయడం హేయమైన చర్య అని ఖండించారు. మండల బీఆర్ఎస్ కమిటీ నాయకులు తెలిపిన ఓ ప్రకటనలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల అండదండలతోనే కొందరు అల్లర్లకు పాల్పడుతూ మహిళలపై దాడులు దిగుతున్నారని ఆరోపించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి: సీపీఎం, సీపీఐ నాయకులు

కల్లూరులో మహిళా ఎస్ఐ హరితపై దాడి ఘటనను కల్లూరు మండల సీపీఎం, సీపీఐ నాయకులు మదాల గోపాలరావు, కార్మిక సంఘం జిల్లా నాయకుడు తన్నీరు కృష్ణార్జునరావు, దామాల దయాకర్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబులు కూడా ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దాడికి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ పోలీసు ప్రెస్ అండ్ మీడియా జాతీయ అధ్యక్షుడు రత్న తారక రాజన్న కూడా తీవ్రంగా ఖండించారు. మహిళలపై దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలని ఆయన సత్తుపల్లి ఏసీపీ రఘును కలిసి వినతి పత్రం అందించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 10 మందికి గాయాలు

జూలూరుపాడులో ఐదుగురికి...

జూలూరుపాడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వినోభానగర్ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామానికి చెందిన సంగపు కృష్ణ, సంగపు రత్నకుమారి మరికొంత మంది బంధువులు కలసి ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలం జన్నారం గ్రామంలో శుభకార్యానికి ఆటోలో వెళ్లారు. అనంతరం వారు ఏన్కూర్ వైపు నుంచి అనిశెట్టిపల్లి ఇంటికి తిరిగి వస్తుండగా మండలంలోని వినోభానగర్ గ్రామ సమీపంలోని సీతారామ రాజీవ్‌లింక్ కెనాల్ వద్ద కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ సమయంలో ఆటోలో 8మందికి పైగా ఉండగా వారిలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వారిలో ముగ్గురిని 108లో జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మండలంలోని గుండెపుడి గ్రామ సమీపంలోని ఆర్‌కె. ఫంక్షన్‌హాల్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. చంద్రగొండ మండలం తిప్పనపల్లి గ్రామానికి చెందిన నాగేశ్వరరావు పని నిమిత్తం జూలూరుపాడుకు వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ సంఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని క్షతగాత్రుడిని 108లో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కామేపల్లిలో ఐదుగురికి..

కామేపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : అదుపు తప్పి ఆటో పల్టీ కొట్టిన సంఘటనలో ఓ మహిళకు తీవ్రగాయాలు, మరో నలుగురికి స్వల్ప గాయాలైన సంఘటన మండల పరిధిలోని బండిపాడు స్టేజీ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. బయ్యారానికి చెందిన కొందరు ఆటోలో లింగాల నుంచి బయ్యారం వెళ్తున్న క్రమంలో ఆటో అదుపు తప్పి పల్టీ కొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి

కామేపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన బర్లగూడెం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బానోత్ సక్రాం (42) పాల్వంచ మండలం కరకవాగు పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు.

సాగుకు సమాయత్తం

» దుక్కిదున్ని విత్తనాలు పెడుతున్న రైతులు » తొలకరి వర్షాలపై ఆశలు

ఖమ్మం రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, వరదలతో అతాలకుతలమై అన్నదాతలకు..ఈ ఏడాదైనా కలిసివస్తుందన్న ఆశతో ఖరీఫ్ సాగుకు సమాయత్తమయ్యారు. దుక్కులు దున్ని విత్తనాలు పెట్టడం కూడా ప్రారంభించారు. భూమిలో పూర్తి స్థాయి పదును లేకున్నా రైతులు పత్తి విత్తనాలు పెట్టడం ప్రారంభించారు. పొసిలో విత్తనాలు పెట్టిన రెండు రోజుల్లో వర్షం పడితే వెంటనే విత్తనాలు మొలకెత్తుతాయని అన్నదాతలు ముందస్తుగా విత్తనాలు పెడుతున్నారు. అయితే రైతులు రూ. వేలు ఖర్చుచేసి విత్తనాలు పెట్టిన తరువాత కూడా కొద్దిరోజులపాటు వర్షాలు పడకుంటే విత్తనాలు మొలకెత్తకపోగా భూమిలోనే కుల్లిపోతాయి. దీంతో వాటికి పెట్టిన ఖర్చులు వృథా కావడమే అవుతుంది.

మండల వ్యాప్తంగా సాగు చేసుకునే భూమి మొత్తం 28,000 ఎకరాలు ఉంది. సాగుకు పనికిరాని భూమి 1,300 ఎకరాలు ఉంది. మండలంలో ప్రధానంగా పత్తి, మిర్చి, మొక్కజొన్న, వరి పంటలు మత్రమే ఎక్కువగా సాగుచేస్తుంటారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో 11 వేల ఎకరాల్లో పత్తి సాగుచేయనున్నారు. అదేవిధంగా 4,500 ఎకరాల్లో మిర్చి పంట సాగుచేయనున్నారు. 7,500 ఎకరాల్లో వరిసాగు చేయనున్నారు. సుమారు 5 వందల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేయనున్నారు.

గత ఏడాది 10,400 ఎరాల్లో పత్తి సాగుచేశారు. 3,800 ఎకరాల్లో మిర్చి సాగు, మొక్కజొన్న ఖరీఫ్‌లో, 250, రబీలో 400 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయడం జరిగింది. వరి ఖరీఫ్‌లో 6,900, కాగా రబీలో 4,500 ఎకరాల్లో వరి సాగుచేయడం జరిగింది. గత ఏడాది 62 000 క్వింటాల పత్తి పండింది. మిర్చి 68వైల క్వింటాల మిర్చీ, వరి ఖరీఫ్, రబీ కలిపి 2 లక్షల 70వేల క్వింటాల ధాన్యం పంటపండింది.


లోక్యాతండ సమీపంలో పత్తి విత్తనాలు పెడుతున్న కూలీలు

మొలకెత్తని పత్తి గింజలు

కూసుమంచి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ముందస్తుగా పలకరించి మురిపించిన వానలు అన్నదాతలను ఆడియాశలు చేస్తున్నాయి. మోస్తరు వర్షాలు, చిరుజల్లులు నమ్మి, దుక్కులు దున్ని, విత్తనాలు నాటుకున్నారు. అయితే అవి గత మూడు, నాలుగు రోజులుగా రోహిణీకార్తె ఎండలతో మాడిపోతున్నాయి. ఒకవేళ వచ్చినా.. చిన్న చిన్న చినుకులే తప్ప ఖరీఫ్‌కు ఉపయోగపడేంత వర్షాలు కురవడం లేదు. గతేడాది ఇబ్బందులను మరిచి, ఖరీఫ్‌సాగుకు సిద్ధమయిన రైతులకు కష్టాలు తప్పేలా లేవు.

గత నెలచివరలో కురిసిన ఒకట్రెండు భారీ వర్షాలకు పలు గ్రామాల్లో రైతులు తమ దుక్కులు సిద్ధం చేసుకున్నారు. మరికొందరు వెంటనే వర్షాలు కొనసాగకపోతాయా.. అనే ఆలోచనతో పత్తి విత్తనాలే నాటారు. జిల్లాలో ఏటా అత్యధిక వర్షపాతం నమోదవుతున్నప్పటికీ, ఈయేడు ఎండల తీవ్రత కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలో రుతుపవనాలు తాకాయని, మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేసింది. కానీ సరైన వర్షాలే కురవడం లేదు.ఆశతో విత్తనాలు వేసిన రైతులు మరోసారి ఆకాశంపైకి చూస్తూ నిరీక్షించాల్సి వస్తోంది. మరో వారం ఇలానే ఉంటే తిరిగి విత్తనాలు వేయకతప్పని పరిస్థితి. ప్రతి సీజన్ లోనూ ఇదేనెలలో విత్తనాలు విత్తుతున్నామని, ఈ ఏడాది కూడా నమ్ముకుని విత్తనాలు నాటామని, వాన దేవుడు కరుణించడం లేదని రైతులు వాపోతున్నారు.

పదును లేకుండా విత్తనాలు విత్తొద్దు...

● ఉమా నగేష్, ఏవో

భూమిలో పదును లేకేండా రైతులు విత్తనాలు విత్తకూడదని ఏవో ఉమా నగేష్ రైతులకు సూచించారు. పొసిలో విత్తనాలు విత్తడం మూలంగా వర్షాలు కురవకుంటే అవి మొలకెత్తకుండా భూమిలోనే కుల్లిపోతాయన్నారు. తద్వారా రైతులకు నష్టం ఏర్పడుతుందన్నారు. రైతులు ఎవరు భూమిలో పదును లేకుండా పత్తి విత్తనాలు పెట్టవద్దని సూచించారు.

ఈ ఏడాదైనా కలిసొచ్చేనా

గత ఏడాది ఎన్నో ఆశలతో పత్తి, మిర్చి, వరి పంటలు సాగు చేసిన రైతులను అకాల వర్షాలు నిండా ముంచాయి. వరదల మూలంగా పంటలు పూర్తి నీటి మునిగిపోయాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు రాకుండా అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లింది. అయితే గత ఏడాది జరిగినట్లుగా నష్టం జరగకుండా ఈ ఏడాదైనా మంచిగా పంటలు పండాలని వరుణుడు కరుణించాలని అకాల వర్షాలతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని అన్నదాతలు ఆశలు పెట్టుకుని ఖరీఫ్ పంటలు సాగు చేస్తున్నారు.

రామాలయాన్ని సందర్శించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


పూజల్లో పాల్గొన్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

భద్రాచలం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారిని ఆదివారం పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్వినిరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆమెకు సంప్రదాయబద్ధం గా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికారు. ఆమె వెంట దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, వేద పండితులు లింగాల రామకృష్ణప్రసాద్, కాంగ్రెస్ నాయకులు ఎండీ. నవాబ్, మామిడి పుల్లారావు పాల్గొన్నారు. భద్రాచలం రామయ్య దర్శనార్థం విచ్చేసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని హరిత టూరిజం నందు ఆమెను కలిసి శాలువతో సత్కారించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ముదిగొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బాణాపురం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పెద్దమండవ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఎనుముల అనిల్‌రెడ్డి స్కూటీపై బాణాపురం వస్తుండగా, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన సర్గం శరత్‌కుమార్(35) బులెట్ బండిపై బాణాపురం నుంచి పెద్దమండవ వైపు వస్తున్నాడు. బులెట్‌బండిని శరత్‌కుమార్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ అనిల్‌రెడ్డి స్కూటీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శరత్‌కుమార్ బండిపైనుంచి కిందపడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో అనిల్‌రెడ్డి కూడా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అనిల్‌రెడ్డి బంధువు హరికృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ హరిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భద్రాచలం సమస్యలను విస్మరిస్తున్న ప్రజాప్రతినిధులు

» సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

భద్రాచలం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): భద్రాచలం సమస్యలను ప్రజాప్రతినిధులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, మంత్రులు విస్మరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆదివారం స్థానిక చందర్‌రావు భవనంలో సీపీఎం జిల్లాకార్యవర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ వద్ద నిర్మిస్తున్న కరకట్ట పనుల జాప్యంతో మరోసారి భద్రాచలం పట్టణ ప్రజలకు ముంపు భయం పట్టుకుందన్నారు. తక్షణమే కరకట్ట పనులకు కావలసిన నిధులను కేటాయించి పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పట్టణ వ్యాప్తంగా ఉన్న స్లూఈజ్‌ల మరమ్మతులు చేపట్టి పట్టణాన్ని గోదావరి ముంపు నుంచి కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో స్వామి, శరత్‌బాబు, గంగ, వెంకటరామారావు, సంతోష్‌కుమార్, సీతాలక్ష్మి, లీలావతి, జ్యోతి, రమేష్, రాఘవయ్య, తదితులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

పేకాట స్థావరంపై దాడి

చింతకాని, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండ ల పరిధిలోని రామకృష్ణాపురం బస్టాండ్ సమీపంలో మున్నేరు ఒడ్డున పేకాట ఆడుతున్న పందిళ్లపల్లి, బొప్పారం, ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ధంసలాపురం గ్రామాలకు చెందిన ఏడుగురు వ్యక్తులను చింతకాని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. సమాచారంతో ఎస్ఐ నాగుల్‌మీరా సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 19,640 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

ఇల్లెందు టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఈతకొట్టేందుకు స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లిన ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన ఇల్లెందు పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని ఓ ప్రాంతానికి చెందిన బాలిక ఆదివారం ఉదయం ఓ పార్కుకు వెళ్లింది. పార్కులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈతకొట్టిన అనంతరం అక్కడే ఉన్న ఓ వ్యక్తి బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. వెంటనే బాలిక తమ తల్లిదండ్రులకు తెలపడంతో తల్లిదండ్రులతోపాటు వారి కుటుంబసభ్యులు వచ్చి సదరు వ్యక్తిని నిలదీసే క్రమంలో ఆ వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. కాగా ఈ సంఘటనపై ఇల్లెందు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందకపోవడం గమనార్హం.



ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని ఖమ్మం నగర ఆర్యవైశ్య మహాసభ మాజీ కార్యనిర్వాహణ అధ్యక్షుడు వెల్లంపల్లి వెంకట సుబ్బారావు, రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిద్ధంశెట్టి శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో విన్నవించారు. పేద, నిరుపేద ఆర్యవైశ్యుల ఆర్థికాభివృద్ధికి, సంక్షేమానికి తోడ్పాటు అందించడానికి ఏ ఉద్దేశంతో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేశారో ఆ ఉద్దేశం నెరవేరకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఆర్యవైశ్యుల అభివృద్ధికి ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లను నిధులు వెంటనే విడుదల చేయాలని ఆ ప్రకటనలో కోరారు.



చిన్నారులకు మందులను అందిస్తున్న రవి, సింహారావు

తలసీమియా చిన్నారులకు అండగా ఉంటాం

బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి, ఆర్టీసీ కరీంనగర్ జోనల్ డాక్టర్ గిరిసింహరావు

ఖమ్మంకలెక్టరేట్,జూన్8(ఆంధ్రజ్యోతి): తలసీమియా చిన్నారులకు అండగా ఉంటామని బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి, ఆర్టీసీ కరీంనగర్ జోనల్ డాక్టర్ గిరి సింహరావు భరోసా ఇచ్చారు. సంకల్ప స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తలసీమియా చిన్నారులకు మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రక్తం ఎక్కించుకునేందుకు చిన్నారులు నెలకు రెండు మూడుసార్లు సూదులు గుచ్చించుకునేందుకు ఎంత నరకయాతన అనుభవిస్తున్నారో తనకు అర్థమవుతందన్నారు. చిన్నారుల కోసం ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదాన శిబిరం ఏర్పాటు చేయిస్తామన్నారు. చిన్నారుల్లో ఆనందం చూసేందుకు ఈసారి తమ బాలాజీ ఎస్టేట్ తరుపున 50మంది తలసీమియా చిన్నారులను విమానం ఎక్కించి వారి సంతోషంలో పాలుపంచుకుంటామన్నారు. ఈ వ్యాధితో చిన్నారులకు వచ్చిన ప్రమాదం లేదన్నారు. వారు సాధారణ జీవితం గడిపేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంకల్ప సంస్థ ఫౌండర్ పి.అనిత, ఉపాధ్యక్షురాలు పి.పావని, కోశాధికారి పి.రవిచందర్, ఉదయ్‌భాస్కర్, వంశీకిరీటి, ఉపేందర్, మధు, అడప నాగేందర్, డాక్టర్ వెంకట్ పాల్గొన్నారు.

కానరాని సిటీ బస్సులు

- గతంలో 17 , ప్రస్తుతం 2 సర్వీసులు
- ఆటో యూనియన్లు, రాజకీయ నాయకుల తీరుతో తిరగని బస్సులు

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్8 (ఆంధ్రజ్యోతి): నగరంలో సిటీబస్సులు కానరాక ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం పట్టణానికి ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండటంతో నగరంలో సిటీ బస్సులను ఏర్పాటు చేశారు. ఆరునెలల పాటు ప్రయాణికులకు, ఆర్టీసీ సంస్థకు ఇబ్బందులు లేకుండా ఉండటంతో ఆర్టీసీకి బారీగానే ఆదాయం సమకూరింది. కానీ ఆటోలకు గిరాకీ లేకపోవటంతో కొందరు ఆటోయూనియన్ నాయకులు కొందరు రాజకీయ పార్టీల నాయకులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో నడిసే సిటీబస్సులను ఆపివేశారనే విమర్శలు వినపడుతున్నాయి. మొదట రెండు సిటీబస్సులతో ప్రాంభించిన అధికారులు ఆ తరువాత 17సర్వీసులను నడిపించారు. ప్రస్తుతం ఒకటి, రెండు బస్సులను రోజుకు ఒకటో, రెండో సర్వీసులు నడిపించి వాటిని ఇతర ప్రాంతాలకు నడుపుతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కావటంతో పట్టణానికి దగ్గరగా ఉన్న ప్రాంతాలకు సిటి బస్సులను నడిపించాలని విద్యార్థులు కోరుతున్నారు.

2022లో రెండు బస్సులతో..

2022లో రెండుబస్సులతో ప్రారంభించిన సిటీబస్సులు ఆదాయం బాగుండటంతో మెదట 11 బస్సులను ఆ తరువాత 17 బస్సులను నగరంలోని అన్ని ప్రాంతాలకు ఖమ్మం పాత బస్టాండ్ నుంచి మమతా రోడ్, వరంగల్ క్రాస్ రోడ్, రఘునాథపాలెం, తదితర ప్రాంతాల వరకు సర్వీసులు నడిపిన ఆర్టీసీ అధికారులు రానురాను ఆ సంఖ్యను తగ్గించారు. చివరకు కేవలం రెండు సిటీబస్సుల సర్వీసులే నడిపిస్తున్నారు. అవి కూడ నూతన బస్టాండ్ నుంచి పాతబస్టాండ్ వరకురోజుకు ఒక్కోబస్సు రెండు మూడు ట్రిప్పులు నడిపి డిపోకే పరిమితమవుతున్నాయి. దీంతో ప్రయాణాకులకు ఆటోలకు ఆశ్రయించక తప్పటంలేదు.

రోజుకు లక్ష ఆదాయం ఉన్నప్పటికీ..

2022 డిసెంబరు వరకు సిటీ బస్సుల ద్వార రోజు లక్షఆదాయం వచ్చిందని,ఇంకా ఆదాయం పెరుగేందుకు అవకాశాలు ఉన్నాయని అధికారులు చెప్పారు. అనంతరం ప్రస్తుతం నగరంలో నాలుగు, ఐదు బస్సులు తిరిగిన దాఖలాలు కానరావడంలేదు. పాత బస్టాండ్‌ను సిటీ బస్టాండ్‌గా మార్చిన తరువాత ప్రయాణికులకు కొంత ఇబ్బందులు ఏర్పడ్డాయి.బోనకల్, ముదిగొండ, ఇల్లెందు తోపాటు పల్లెవెలుగు బస్సులన్నీ సిటీ బస్టాండ్ నుంచే సర్వీసులు నడుస్తుండటంతో ప్రయాణికులకు తెలియక, ఆర్టీసీ అధికారులు ప్రచారం చేయ్యక ఎక్కువగా ప్రయాణికులు నూతన బస్టాండ్‌కే వస్తున్నారు. ఇక్కడ నుంచి ఆ సర్వీసులు లేవు అని తెలిసి ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

ప్రచారం శూన్యం

నూతన బస్టాండ్‌లో సిటీ బస్సు ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలిపే సూచిక బోర్డులు కానీ మైక్ ద్వారా ప్రచారం లేక పోవడమే ఇందుకు కారణం. ఆటోడ్రైవర్లు బస్టాండ్ లోపలికి వచ్చి ప్రయాణికులను తీసుకెళుతున్నా, ఆర్టీసీ అధికారులు పోతేపోనీ అనే ధోరణిలో ఉన్నారనే చెప్పవచ్చు.

నాయకుల ఒత్తిడితోనే

గతంలో ఖమ్మం నగరానికి అర్బన్ బస్సుల పేరుతో 2014లో 22 బస్సులను కేటాయించింది.



కానీ అధికారులు ఆ బస్సులను తిప్పకుండా తిరిగి హైదరాబాద్ పంపించారు. వాటిని ఎక్కువగా ఇల్లెందు, కోదాడ, తదితర ప్రాంతాలకు నడిపారు.అనంతరం వాటిని డిపోలోనే పక్కకు పెట్టిన అధికారులు ఇప్పుడు అదే సిట్టింగ్ ఉన్న సిటీ బస్సులను ఎలా నడుపుతున్నారో తెలియని పరిస్థితి. రాజకీయ నాయకులు, ఆటో యూనియన్ల ఒత్తిడి కారణంగా సిటీ సర్వీసులను తగ్గించి వేరే ప్రాంతాలకు పంపిస్తున్నట్లు విమర్శలు వినపడుతున్నాయి.నూతన బస్టాండ్ నుంచి సిటీ బస్టాండ్‌కు వెళ్లాలంటే ఆటోను ఆశ్రయించాల్సిందే కారణం సిటీబస్సులు అందుబాటులో లేకపోవడమే. అవిఎప్పుడు వస్తాయో, ఎప్పుడు పోతాయో తెలవని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

కూసుమంచి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. కూసుమంచి మండలం పోచారంలో ఉదయం 10:30కు ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. 11:15కు ఖమ్మంరూరల్ మద్దులపల్లి బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 11:45కు తెల్దారుపల్లి గ్రామంలో సీసీ రోడ్లనిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 12:15కు కస్నాతండా వద్ద కస్నాతండ-ములకలపల్లి బీటీరోడ్డు నిర్మాణ పనులు, 12:45కు పోలేపల్లి-రాజీవ్‌గృహకల్ప కాలనీ బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3:30కు ట్రాన్స్‌పోర్ట్, బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రఘునాథపాలెంలో గౌడ కమ్యూనిటీ భవనానికి భూమి పూజ చేస్తారు. మంత్రి పర్యటనకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

విద్యార్థుల భవిష్యత్ కోసం పని చేయాలి

- డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ
- నూతన సంక్షేమాధికారులకు శిక్షణ



నూతన సంక్షేమాదికారులతో డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మంచి విద్యాభవిష్యత్ కోసం సంక్షేమాధికారులు శ్రమించాలని సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు నూతనంగా నియామకం జరిగిన 18 మంది సంక్షేమాధికారులకు ఖమ్మంలో నెల రోజులు పాటు సీనియర్ సంక్షేమాధికారి కొటపాటి రుక్మారావు ఆధ్వర్యంలో వృత్తిపరమైన శిక్షణ ఇచ్చారు. శిక్షణా కాలం పూర్తి కావటంతో ఆదివారం ఖమ్మం ఎస్సీసంక్షేమ వసతిగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణ పత్రాలను డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ అందించారు.విధినిర్వాహణంలో సేవాభావంతో పనిచేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచటం ద్వారా నిరుపేద విద్యార్థులకు విద్యాశాతం పెరుగుతుందన్నారు. ఎప్పుడు సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను ఖచ్చితంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వసతిగృహాల సంక్షేమాధికారుల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, కోశాధికారి కే తిరుపతిరావు, ఇటీవల ఉద్యోగంలో చేరిన సంక్షేమాధికారులు కూడా పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యతో భవిష్యత్ ఉన్నతం

- కాంగ్రెస్ నాయకుడు దయాకరరెడ్డి, డీపీఎస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి
- నూతనభవనంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్



పాఠశాలను ప్రారంభిస్తున్న దయాకరరెడ్డి, పాఠశాల డైరెక్టర్ రవీందర్‌రెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్ అంతా తరగతి గదిలోనే ఆధారపడి ఉందని, ఎంత నాణ్యమైన విద్యను అందిస్తే విద్యార్థుల భవిష్యత్ అంత ఉన్నతంగా ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకరరెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని గోపాలపురంలో అంతర్జాతీయప్రమాణాలతో నూతన భవనంలో ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమానికి తుంబూరు దయాకరరెడ్డి, పాఠశాల డైరెక్టర్ రవీంద్రరెడ్డి హాజరయ్యారు. పాఠశాలను ప్రారంభించి మాట్లాడారు. నిర్బంధ విద్యకు పూర్తిగా వ్యతిరేకమని, విలువలతోకూడిన విద్యను అందించడానికి మా ఉపాధ్యాయ బృందం ఎప్పటికి కృషి చేస్తుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రణధీర్ మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్దే ధ్యేయంగా పాఠశాల పురోగతికి కృషిచేస్తామని, భవిష్యత్తులో అత్యున్నత ఫలితాలు అందిస్తామన్నారు.

మృగశిర మురిపెం



కూసుమంచి, జూన్8 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె సందర్భంగా ప్రజలు చేపల కొసం ఎగబడ్డారు. మృగశిర కార్తె చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. అయితే పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడా లేకుండా చేపలను కొనుగోలు చేశారు. వ్యాపారులు ముందుగానే చుట్టుపక్కల చెరువులు, విజయవాడ ప్రాంతం నుంచి చేపలను తీసుకొచ్చి వినియోగ దారులకు అందించారు. కూసుమంచి, పాలేరు, నాయకన్‌గూడెం గ్రామాల్లో భారీ విక్రయాలు జరిగాయి. జీళ్లచెరువు గ్రామంలో లైవ్ ఫిష్‌ను విక్రయించారు. బొచ్చెలు రూ.250, రవ్వలు రూ.240, కొర్రమీను రూ.500కు విక్రయించారు. ధర పెంచి విక్రయించినప్పటికీ ప్రజలు చేపలను తినాలనే ఆశకొద్దీ కొనుగోలు చేశారు.

‘ఆర్యవైశ్యుల అభివృద్ధికి పాటు పడుతాం’



ప్రమాణ స్వీకారం చేస్తున్న చంద్రరావు

కల్లూరు,జూన్8(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సమాజ అభివృద్ధికి అన్ని విధాలుగా పాటు పడుతామని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ కల్వ సుజాత, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. ఆదివారం కల్లూరులో జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవానికి వారు విశిష్ట అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటిల సహకారంతో ఆర్యవైశ్యుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా పదవి బాధ్యతలు చేపట్టిన చంద్రరావు రాజకీయంగా ఎంతో అనుభవం కలిగినందున జిల్లాలో ఆర్యవైశ్యుల సంఘ పరంగా మరింత సేవా కార్యక్రమాలు జరిగే అవకాశం ఉందన్నారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా పసుమర్తి చంద్రరావు, ప్రధాన కార్యదర్శిలుగా వనమా కిరణ్‌కుమార్, గోళ్ల రాధకృష్ణమూర్తి,కోశాధికారిగా పసుమర్తి వెంకటేశ్వరావు, మహిళా విభాగం అధ్యక్షురాలుగా దోసపాటి సంధ్యరాణి, ప్రచార కార్యదర్శిగా కె బలరామ్, పలు అనుబంధ సంఘాల కమిటీల నాయకులు ప్రమాణం చేశారు. అంతకు ముందు కల్లూరులో ఆర్యవైశ్యులు చంద్రరావుతోపాటు కలిసి భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు పసుమర్తి రామకృష్ణ, అనుమోలు శ్రీనివాసరావు, చారుగుండ్ల అచ్యుతసీతారామారావు, దోసపాటి భాస్కరావు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్పొరేటీకరణే మోదీ ప్రభుత్వ లక్ష్యం

పెనుబల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్పొరేటీకరణ కోసమే రైతు వ్యతిరేక నల్లచట్టాలను దొడ్డిదారిన అమలుచేయటానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పులకుంట రవి ఆరోపించారు. ఆదివారం పెనుబల్లిలో అఖిలభారత ఐక్యరైతుసంఘం కల్లూరు డివిజన్ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. హిందూత్వ రాజ్యస్థాపన లక్ష్యంగా మోదీ ప్రభుత్వం అడుగులు వేస్తోందని, దేశభక్తి ముసుగులో దేశదురాభిమానాన్ని మెదడుల్లో నూరిపోస్తోందన్నారు. దేశప్రయోజనాలను పూర్తిగా పక్కన పెట్టి కేవలం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం అనేక నూతన చట్టాలను వారిక నుగునంగా ప్రవేశపెడుతోంతన్నారు. మహాసభలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు, కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు, ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి వెంకటరెడ్డి, జిల్లానాయకులు గంటా శ్రీను, బీరెల్లి లాజర్, ట్రేడింగ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అమర్లపూడి శరత్, పుల్లారావు, తాటి రాజు, బత్తినేని శ్రీనివాసరావు, ఎస్వీ రమణ పాల్గొన్నారు.

గిరిజన మోర్చా అధ్యక్షుడిగా రాజేష్

కామేపల్లి,జూన్8(ఆంధ్రజ్యోతి): బీజేపి గిరిజన మోర్చా మండల అధ్యక్షుడిగా గోవింద్రాల గ్రామానికి చెందిన బాదావత్ రాజేష్ నియామితులైయ్యారు. ఆదివారం కామేపల్లిలో రాజేష్‌కు నియామక పత్రాన్ని మండల అధ్యక్షుడు జర్పల రామారావు అందజేశారు. గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు భూక్య శ్రీను జిల్లా నాయకులు పోలూరి రామచంద్రయ్య అభినందించారు. ఈకార్యక్రమంలో దరావత్ బాలక్రిష్ణ,వీరబోయిన మదార్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నేలకొండపల్లి,జూన్8(ఆంధ్రజ్యోతి):నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెలనెలా ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఆదివారం స్థానిక రావెళ్ళభవన్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 113మంది రోగులను పరీక్షించారు. ఖమ్మానికి చెందిన ఆసుపత్రి వారు 32 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు సీహెచ్ భారవి, సుబ్బారావు రోగులను పరీక్షించగా, గ్రామీణ వైద్యులు సహకరించారు. నేలకొండపల్లికి చెందిన వ్యాపారవేత్త మాటూరి సుబ్రమణ్యం అల్పాహారం వితరణ చేశారు. కార్యక్రమంలో ఏటుకూరి రామారావు, గుడవర్తి నాగేశ్వరరావు, మంకెనపల్లి నర్సింహారావు,ఏలూరి కోదండరామారావు, సామాల మల్లికార్జున్, షేక్.జమాల్‌పాషా, వల్లంచెట్ల భాస్కరరావు, దండా సూర్యనారాయణ, ఈగా అనిల్‌కుమార్ వాలంటీర్లుగా సేవలందించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నేలకొండపల్లి, జూన్8(ఆంధ్రజ్యోతి):పాతఅరవిందా విద్యాలయం విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. 1990లో పదోతరగతి చదివిన వీరు 35 సంవత్సరాల అనంతరం కలుసుకోవటంతో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కళాశాల కరస్పాండెంట్ వడ్డె వెంకటేశ్వరరావు పూర్వ విద్యార్థులు అనగాని నర్సింహారావు, దోసపాటి చంద్రశేఖర్, పోలూరి మురళి, కొండబాల అశోక్ పాల్గొన్నారు.

ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి, జూన్8(ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న టిప్పర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో మోపెడ్‌ను నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. భైరవునిపల్లికి చెందిన పర్వత రాములు అలియాస్ రాముడు ఆదివారం ఉదయం తన మోపెడ్‌పై నేలకొండపల్లి నుంచి భైరవునిపల్లి వెళుతున్నాడు. ఈక్రమంలో భైరవునిపల్లి-నాచేపల్లి వెళ్ల రోడ్డు క్రాసింగ్ వద్ద ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టాడు. దీంతో రాములుకు కాలు, చెయ్యి ఫ్రాక్చర్ అయినట్లు సమాచారం. రాములును 108అంబులెన్సులో తొలుత నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు.

నేడు కాల్వొడ్డు దర్గాలో ఉర్సు ఉత్సవం

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏటా జరిగే హజారత్ సొండే షాహీద్ దర్గా కాల్వొడ్డు ఉర్సు ఉత్సవాలు సోమవారం నిర్వహించనున్నారు. ఖమ్మం అర్బన్ తహశీల్దార్ కార్యాలయము నుంచి ఈ కార్యక్రమాలు జరుగుతాయని తహసీల్దారు సైదులు తెలిపారు. కండిల్, చాదర్ ఆవిష్కరణ కార్యక్రమము సోమవారం సాయంత్రం 7.00 గంటలకు ప్రారంభం అవుతుందని ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని దర్శించుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

హామీలు అమలు చేయాలి

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సంఘం భవనంలో రఘునాథపాలెం మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈకార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు, శిరీష, నాగార్జున, రవీందర్ పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

జిల్లా కాంగ్రెస్ నాయకుడు నరేష్‌రెడ్డి

తిరుమలాయపాలెం, జూన్8(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుందని జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సుబ్లేడులోరాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో రూ.2.76కోట్లతో ఇంటిగ్రేటేడ్ హాస్టల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో మంత్రి పొంగులేటి నిదులు మంజూరుచేశారని తెలిపారు. పొంగులేటి చొరవతో ఈప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధిచెందుతుందన్నారు. ఈకార్యక్రమంలో విన్సెంట్‌రావు, సత్యనారాయణరెడ్డి, నాయులు బత్తుల వెంకటనారాయణ, యలమంద, సైదులు, రమేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కందాళ పర్యటన



శీత్లాతండాలో ఆలయ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న కందాళ

కూసుమంచి, జూన్8(ఆంధ్రజ్యోతి): మండలంలో పాలేరు మాజీ ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. శీత్లతండాలో అభయాంజనేయస్వామి ఆలయ విగ్రహ, ధ్వజస్థంభ వేడుకల్లో పాల్గొన్నారు. లోక్యాతండ, చేగొమ్మ, నర్సింహులగూడెం, బికారీతండలో వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. చేగొమ్మలో ముత్యాలమ్మ గుడి ప్రారంభంలో పూజలు నిర్వహించారు.

తిరుమలాయపాలెం:మండలంలోని వివిధ గ్రామాల్లో పలు వివాహ వేడుకల్లో ఆదివారం మాజీ ఎమ్మెల్యేకందాల ఉపేందర్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండలంలోని మేకలతండా, తాళ్లచరువు, హైదరసాయిపేట, సుద్దవాగుతండా, మహ్మదాపురం తదితర గ్రామాలలోని వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, దేవేందర్ రెడ్డి, బానోతు రవి, బోడ మంచానాయక్, స్టాలిన్‌రెడ్డి, బోడ హైమావతి, బొల్లికొండ రమేష్ పాల్గొన్నారు.

మదన్‌లాల్‌కు నివాళి

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్8(ఆంధ్రజ్యోతి): బంజారజాతి ఓ మంచి నాయకుడిని కోల్పోయిందని ఆయనలేని లోటు ఎవరు తీర్చలేనిదని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ అన్నారు. ఆదివారం ఈర్లపుడిలో జరిగిన మదన్‌లాల్ సంస్మరణ సభకు హాజరయ్యారు.

పునఃప్రతిష్ఠలో పాల్గొన్న మాధురి



బోనంతో మంత్రి పొంగులేటి సతీమణి

నేలకొండపల్లి, జూన్8 (ఆంధ్రజ్యోతి):మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి పొంగులేటి మాధురి ఆదివారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత గంగమ్మ గుడి పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామమహిళలతో కలిసి బోనం ఎత్తుకుని గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. కోరట్లగూడెం, పైనంపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్లకు శంకుస్థాపన చేశారు.నూతన వస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, శాఖమూరి రమేష్, వి.సీతారాములు, కందుల వెంకటేశ్వరరావు, బచ్చలకూరి నాగరాజు,బొడ్డు బొందయ్య, మామిడి వెంకన్న, జె.అంజని, లిక్కి వీరబాబు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాలేరులో పర్యటన

కూసుమంచి:పొంగులేటి సతీమణి మాధురి విస్తృతంగాపర్యటించారు. కూసుమంచి, ఖమ్మం రూరల్, మండలాలో ఉదయంనుంచి సాయంత్రం వరకు సుమారు 24 కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆమె నూతన వధూవరులకు పట్టు వస్త్రాలు అందజేశారు. పంచెకట్టు, ఓణీల అలంకరణ వేడుకల్లో పాల్గొన్నారు. సుమారు ఆరున్నర గంటలపాటు పర్యటించారు.

మాణిక్యారంలో ముత్యాలమ్మకు బోనాలు

కారేపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాణిక్యారం గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ తల్లికి గ్రామ మహిళలు బోనాలు సమర్పించారు. గ్రామంలో ముత్యాలమ్మతల్లిని ప్రతిష్ఠంపచేసి 16రోజులు అయిన సందర్భంగా గ్రామస్థులు ముత్యామ్మతల్లికి బోనాలు సమర్పించి, మేకలు, కోళ్ళుకోసి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల సందడితో గ్రామంలో పండగవాతవరణం ఏర్పడింది.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



కాంగ్రెస్ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని నేతాజీ రోడ్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదల సొంతింటి కల నెరవేరుతుందన్నారు. అంతకముందు 22వ వార్డులో జైబాపు.. జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

చింతకాని, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు చింతకాని గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మడుపల్లి భాస్కర్, కన్నెబోయిన గోపి, ఎండపల్లి శ్రీనివాసరావు, ఆలస్యం శంకర్, దేశబోయిన వెంకటేశ్వర్లు, అబ్దుల్ మజీద్, ఖాసీం, రాంబాబు, సైదులు, నాగరాజు పాల్గొన్నారు.

బాలికల సంఖ్య పెంచేందుకు ప్రచారం



ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ఏన్కూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినిల సంఖ్య పెంచేందుకు మహిళ ఉపాధ్యాయులు అహర్నిశల శ్రమిస్తున్నారు. బాలికలకు పాఠశాల ప్రత్యేక రక్షణగా ఉంటుందని తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటికి తిరిగి పదో తరగతి ఫలితాల్లో విద్యార్థినిలు సాధించిన మార్కులను వివరిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతతోపాటు మండల స్థాయిలో ఎన్.సౌమ్య 534 ప్రథమ, టి.హారిక, డి.వెంకటలక్ష్మి 531 మార్కులతో ద్వితీయస్థానాలు సాధించిన బాలికల ఫొటోలతో వాల్‌పోస్టర్, కరపత్రాలను ముద్రించి విస్తృత ప్రచారం చేస్తున్నారు.

ఎస్ఐపై దాడి వ్యక్తిగతమైంది

తల్లాడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరు ఎస్ఐ హరితపై జరిగిన దాడిని కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండలం నాయకులు ఖండించారు. ఆదివారం తల్లాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమవేశంలో బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్‌లు మాట్లాడుతూ.. ఎస్ఐపై జరిగిన దాడి వ్యక్తిగతమైందని, రాజకీయ ప్రమేయం లేదని దాడికి పాల్పడిన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. మండల కాంగ్రెస్ నాయకులు జక్కంపుడి కిషోర్, అడపా అనిల్, తుమ్మలపల్లి రమేష్, పాల్గొన్నారు.

27న పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు

▸ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మీ



సత్తుపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న సత్తుపల్లి నుంచి ఐదు పుణ్యక్షేత్రాలు సందర్శించేందుకు ప్రత్యేక డీలక్స్ బస్సును నడపనున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మీ ఆదివారం తెలిపారు. ఈనెల 27న తెల్లవారుజామున నాలుగు గంటలకు సత్తుపల్లి నుంచి డీలక్స్ బస్సు బయల్దేరి ఐదు పుణ్యక్షేత్రాలను దర్శింపజేసుకుని అదేరోజు రాత్రి పదిగంటలకు సత్తుపల్లి చేరుకుంటుందన్నారు. ముందుగా సత్తుపల్లి నుంచి బయల్దేరి ఏపీలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయం తర్వాత ద్రాక్షారామంలోని భీమేశ్వర స్వామి ఆలయం, వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు పెనుగొండలోని కన్యకాపరమేశ్వరమాత ఆలయం, ద్వారకా తిరుమల పుణ్యక్షేత్రాలను దర్శింపజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ ఐదు పుణ్యక్షేత్రాలు దర్శించుకునేందుకు డీలక్స్ బస్సు ఛార్జీ పెద్దలకు రూ.వెయ్యి, పిల్లలకు రూ.700లుగా నిర్ణయించినట్లు ఆమె వివరించారు. దేవాలయాల్లోని ఇతర టిక్కెట్లు, ఇతర ఖర్చులు భక్తులే భరించాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు 9866619189, 9542698518 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మాగంటికి సండ్ర నివాళి



గోపినాథ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పేర్కొన్నారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ భౌతికకాయాన్ని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాదాపూర్‌లోని నివాసంలో సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాగంటి గోపినాథ్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మృగశిర సందడి

▸ అధికధరలకు చేపల విక్రయాలు

▸ ఎగబడి కొనుగోలు చేసిన జనం

కారేపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె రోజున చేపలు తింటే చాలమంచిది అనే వాడుక ఉండడంతో ఆదివారం మృగశిరకార్తె సందర్భంగా చేపల కోసం మండల జనం ఎగబడ్డారు. ఎంత ధర అయిన సరే కులమతాలతో సంబంధం లేకుండ అధిక ధరలకు పోటీలు పడి చేపలను కొనుగోలు చేశారు. మాములగ తెల్ల చేపలు కీలో వంద రూపాయాల నుంచి రూ.120వరకు విక్రయించేవారు. కానీ ఆదివారం మాత్రం రూ.రెండువందల నుంచి రెండువందలయాభై వరకు విక్రయించారు. అయిన ధరతో సంబంధం లేకుండ చేపలు కొనుగోలు చేసుకున్నారు.



కారేపల్లి క్రాస్ రోడ్డులో చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు

కొణిజర్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మృగశిరకార్తెను ప్రజలు సాంప్రదాయకంగా పాటిస్తున్నారు. ఆదివారం మృగశిరకార్తె సందర్భంగా ప్రజలు గ్రామాలలో ఎగబడి చేపలను కొనుగోలు చేశారు. మృగశిర రోజు చేపలు తినాలనే సాంప్రదాయాన్ని ఇంకా పాటించుకుంటూ వస్తున్నారు.

వైరా, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మృగశిరకార్తెను పురస్కరించుకొని ఆదివారం వైరాలో ఇతర ప్రాంతాలను తీసుకువచ్చిన చేపలను విక్రయించారు. చెంతనే రిజర్వాయర్ ఉన్నప్పటికీ చేపల ఉత్పత్తి లేకుండాపోయింది. రిజర్వాయర్ రోడ్డులో నాలుగైదు చోట్ల టెంట్లు ఏర్పాటు చేసి చేపలను విక్రయించారు. కిలో ఒక్కింటికి రూ.200చొప్పున చేపలు విక్రయించారు. వైరా పరిసర ప్రాంతాల నుంచి వందలాదిమంది ఇక్కడకు వచ్చి చేపలు కొనుగోలు చేయడంతో రోడ్డు కిటకిటలాడింది.



తనికెళ్ళలో చేపలు కొంటున్న స్థానికులు



వైరాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో చేపలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

ఘనంగా గంగమ్మతల్లి జాతర



టీఎల్‌పేటలో గ్రామంలో బోనాలతో బయలుదేరిన మహిళలు

ఏన్కూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీఎల్‌పేట గ్రామంలో ఆదివారం యాదవులు గంగమ్మతల్లి జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, డప్పువాయిద్యాయల నడుమ చిన్నారులు, మహిళలు, యువతి, యువకులు బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా బయలుదేరి గ్రామదేవతల దగ్గర పూజలు చేశారు. ముందుగా గంగమ్మతల్లి దగ్గర ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. అనంతరం మైసమ్మతల్లి దగ్గర పూజలు చేశారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని గ్రామదేవతలను వేడుకున్నారు.

దేశ ప్రజలపై భాజపా భారం

పెనుబల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడుసార్లు అధికారం చేపట్టిన బీజేపీ ప్రజలపై అనేక భారాలను మోపిందని, మతతత్వ ఎజెండాతో ప్రజలను రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధిపొందేందుకు కుట్రలను కేంద్రం ప్రోత్సహిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు ఆరోపించారు. ఆదివారం పెనుబల్లి మండల సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అఖిలభారత రాజకీయ తీర్మానాలను మాదినేని రమేష్ బోధించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీజేపీ ప్రజలపై అనేక భారాలను మోపిందని, ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. పెట్టుబడిదారులకు 90శాతం సంపదను దోచిపెడుతూ సామాన్య ప్రజలు, రైతులు ఆర్థికంగా వెనుకబాటు తనానికి గురిచేస్తోందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక వ్యవసాయరంగం నిర్వీర్యమవుతుందన్నారు. దేశంలో వ్యవసాయ ఎగుమతులకు పన్నులు విధించేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని దుయ్యబట్టారు. ఈ శిక్షణ తరగతులు మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అధ్యక్షతన జరుగగా జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు, గ్రామశాఖ కార్యదర్శులు మిట్టపల్లి నాగమణి, చమట విశ్వనాథం, భూక్యా ప్రసాద్, గుడిమెట్ల బాబు, మంగమ్మ, చిరంజీవి, చిట్టిమోదుల కృష్ణ, కంటే సత్యం పాల్గొన్నారు.

మహిళలపై దాడులను ఉపేక్షించేది లేదు

▸ ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి

కల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏ రాజకీయ పార్టీలకు చెందిన వారైన మహిళలపై దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం కల్లూరు ఏఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు తక్కేళ్లపాటి ప్రసాద్, లక్కినేని కృష్ణ, ఏనుగు సత్యం బాబులు మాట్లాడారు. ఇటీవల కల్లూరులో మహిళ ఎస్ఐ హరితపై కొందరు యువకులు మద్యంసేవించి దాడికి పాల్పడడాన్ని వారు త్రీవంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న ఎస్ఐపై అకారణంగా కొందరు యువకులు దాడికి పాల్పడితే అది కాంగ్రెస్ వారే చేశారని, దాని వెనుక సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దయానంద్ హస్తం ఉందని అనటం అవాస్తవమన్నారు. ఎమ్మెల్యే రాగమయి అండండలతో ఈ దాడి జరిగిందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ నాయకులు వ్యాక్యలు చేయటం ఎంత వరకు సమర్ధనీయమని మండల కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. గతంలో సత్తుపల్లి నియోజవర్గ శాసన సభ ఎన్నికల ప్రచారంలో కల్లూరు మండలం చెన్నూరు గ్రామంలోని దేవాలయంలో దర్శించుకునే క్రమంలో ఎమ్మెల్యే రాగమయిని ఓ మహిళ అని కూడ చూడకుండా అడ్డుకున్న నాయకులు బీఆర్ఎస్ వారేనన్న విషయాన్ని విస్మరించారని వారు గుర్తుచేశారు. మహిళ ఎస్‌పై జరిగిన దాడికి కారుకులైన వారిని చట్ట పరంగానే శిక్షించటం జరుగుతుందన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా కుటుంబంపై మాజీ ఎమ్మెల్యే సండ్రతో పాటుగా బీఆర్ఎస్ నాయకులు అవాస్తవమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు పొట్రు అర్జునరావు, బాగం ప్రభాకరచౌదరి, భూక్యా శివకుమార్‌నాయక్, శ్రీసంతాన వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ దారా రంగా, ఆళ్ల నరిసింహారావు, ఎల్ పుల్లారావు, పెద్దబోయిన శ్రీను, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



కల్లూరు సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి

ఘనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలు

మధిరటౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): 'ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము చదువులమ్మ చెట్టు నీడలో' అంటూ ఆ నాటి తమ పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు ఒకరిని ఒకరు పలకరింపులతో కళాశాల ప్రాంగణం పులకించిపోయింది. ఎంతో పేరు ప్రఖ్యాతలు, ఎందిరికో మార్గదర్శి, మరెందరో బవిష్యత్‌ను తీర్చి దిద్దిన మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ సంబరాలు ఆదివారం కళాశాలలో ఘనంగా జరిగాయి. మధిరలో 1969-70 ప్రారంభమైన ప్రభుత్వ జూనియర్ కళాశాల 55 ఏళ్లపాటు 11వేల మందికి పైగా విద్యాబుద్దులు నేర్పింది. చదువుకున్న ప్రతి విద్యార్థికి ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చిన కళాశాల మళ్లీ నేడు అందరిని ఒకే వేదిక మీదకు చేర్చి ఆనాటి స్మృతులను నెమర వేసుకునేలా నిర్వహకులు అద్భుతంగా ఏర్పాట్లు చేశారు. పూర్వ విద్యార్థులతోపాటు స్థానిక కళాకారులు తమ కళా ప్రదర్శనలతో ఆహుతులను అలరించారు. కళాశాల ప్రిన్సిపాల్ జయదాసు, పూర్వ విద్యార్థులు అద్దంకి విప్లవ కుమార్, బెజవాడ రవి, రంగిశెట్టి కోటేశ్వరరావు, మల్లాది వాసు, కరివేద వెంకటేశ్వరరావు, కల్యాణం వెంకటేశ్వరావు, బివిఆర్, మక్కెన నాగేశ్వరరావు, రమణ, వంకాయలపాటి శంకర్‌రావు, రామకృష్ణ, కట్టా పూర్ణ పాల్గొన్నారు.



ఆ నాటి తమ క్లాస్‌రూంలో కూర్చుని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటున్న పూర్వ విద్యార్థులు

బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు

వైరా, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు పెడుతూ నష్టపోయిన యువత ఆత్మహత్యలు చేసుకుంటుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆన్‌లైన్ బెట్టింగ్‌లను పెంచి పోషిస్తున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్.బషీరుద్దీన్, సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం విమర్శించారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన యువచైతన్య సైకిల్ యాత్ర పదవరోజు ఆదివారం వైరా మండలంలోని అష్ణగుర్తి, గొల్లెనపాడు, గొల్లపూడి, రెబ్బవరం, జింకలగూడెం, తాటిపూడి గ్రామాల్లో నిర్వహించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేష్ అధ్యక్షతన జరిగిన సభల్లో వారు మాట్లాడారు. ఈ యాత్రలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, శీలం వీరబాబు, యాత్ర మేనేజర్ సత్తెనపల్లి నరేష్, గుమ్మా ముత్తారావు, బొడ్డు మధు, గడ్డం విజయ్, రావులపాటి నాగరాజు, గోపినాథ్, రాకేష్, ధీరజ్, వేణు ఈ యాత్ర చేశారు. సీపీఎం నాయకులు బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, కిలారు శ్రీనివాసరావు తదితరులు బెట్టింగుల్లో నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న వారికి సంఘీభావం తెలిపారు.



ర్యాలీలో ప్రసంగిస్తున్న సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం

ఆర్యవైశ్యుల అభివృద్ధికి పాటు పడుతాం

కల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల అభివృద్ధికి అన్ని విధాలుగా పాటుపడుతామని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. ఆదివారం కల్లూరులో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆర్యవైశ్యులు వ్యాపార రంగంలోనే కాకుండా రాజకీయ రంగాల్లో కూడ రాణించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో ఆర్యవైశ్యుల సంక్షేమానికి రాష్ట్ర సంఘం అండగా నిలుస్తుందన్నారు. పేద ఆర్యవైశ్యుల పిల్లలు విద్య రాణించేలా ఆర్థిక చేయూతనివ్వడం జరగుతుందని చెప్పారు. తెలంగాణలో వెనుక బడిన ఆర్యవైశ్యులను ఈబీసీలుగా గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని కల్వ సుజాత చెప్పారు. ఖమ్మం జిల్లాలో ముగ్గరు మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటిల సహకారంతో ఆర్యవైశ్యుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం జరగుతుందన్నారు. ప్రభుత్వ పరంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తించేలా ఆర్యవైశ్య సంఘ పరంగా కృషి చేస్తామన్నారు. నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా పదవి బాధ్యతలు చేపట్టిన చంద్రరావు కూడ రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్నందున జిల్లాలో ఆర్యవైశ్యుల సంఘ పరంగా మరింత సేవా కార్యక్రమాలు జరిగే అవకాశం ఉందన్నారు.



చంద్రరావును గజమాలతో సత్కరిస్తున్న రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా పసుమర్తి చంద్రరావుతో పాటుగా ప్రధాన కార్యదర్శిలుగా వనమా కిరణ్‌కుమార్, గోళ్ల రాధకృష్ణమూర్తి, కోశాధికారిగా పసుమర్తి వెంటేశ్వరావు, మహిళా విభాగం అధ్యక్షురాలుగా దోసపాటి సంధ్యరాణి, ప్రచార కార్యదర్శిగా కె.బలారాంతోపాటుగా పలు అనుబంధ సంఘాల కమిటీల వారిని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, తెలంగాణరాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఉప్పల శారదలు పై విధంగా పదివి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు చంద్రరావుతో పాటుగా కార్యవర్గ బాధ్యులందరిని గజమాలతో సత్కరించి అభినందించారు. ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు పసుమర్తి రామకృష్ణ, అనుమోలు శ్రీనివాసరావు, చారుగుండ్ల అచ్యుతసీతారామారావు, దోసపాటి బాస్కరావు పాల్గొన్నారు.

చింతకాని, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యవర్గంలో మండలానికి చెందిన పలువురు ఎన్నికయ్యారు. పాతర్లపాడు గ్రామానికి చెందిన తేలుకుంట్ల శ్రీనివాసరావు ఉపాధ్యక్షునిగా కార్యదర్శులుగా తేలుకుంట్ల శంకర్‌రావు, జవాజీ వీరాంజనేయులు, కొండ వెంకటేశ్వర్లు ఆదివారం కల్లూరు పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ప్రమాణస్వీకారం చేశారు. గ్రామానికి చెందిన పలువురు సభ్యులను అభినందించారు.

పెద్దమ్మతల్లి వార్షికోత్సవ కరపత్రం అవిష్కరణ



కరపత్రాన్ని అవిష్కరిస్తున్న ఆలయ కమిటి సభ్యులు

కారేపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో ఈనెల 15నుంచి 18వరకు జరగనున్న వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలకు సంబందించిన కరపత్రాన్ని అదివారం ఆలయంలో కమిటి సభ్యులు అవిష్కరించారు. వార్షికోత్సవ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతంచేయాలని చైర్మన్ తురక నారాయణ కోరారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన తాళ్ళూరి సారయ్య దంపతులు అమ్మవారి ఆలయానికి వెండిగంటలను బహూకరించారు.

వ్యవసాయ కార్పొరేటీకరణే మోదీ ప్రభుత్వ లక్ష్యం

▸ పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి

పెనుబల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్పొరేటీకరణ కోసమే రైతు వ్యతిరేక నల్లచట్టాలను దొడ్డిదారిన అమలుచేయటానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పులకుంట రవి ఆరోపించారు. ఆదివారం పెనుబల్లిలో అఖిలభారత ఐక్యరైతుసంఘం కల్లూరు డివిజన్ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశాన్ని హిందు మత రాజ్యంగా చేసేందుకు మోదీ ప్రభుత్వం అన్నీ ప్రయత్నాలు చేస్తోందని, హిందూత్వ రాజ్యస్థాపన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి దశలో అడుగులు వేస్తోందని, దేశభక్తి ముసుగులో దేశదురాభిమానాన్ని మెదడుల్లో నూరిపోస్తోందన్నారు. దేశ ప్రయోజనాలను పూర్తిగా పక్కన పెట్టి కేవలం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం అనేక నూతన చట్టాలను వారికనుగునంగా ప్రవేశపెడుతోంతన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకందగా ప్రజలంతా ఏకం కావలన్నారు. మహాసభలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు, కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు, ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి వెంకటరెడ్డి, జిల్లా నాయకులు గంటా శ్రీను, బీరెల్లి లాజర్, ట్రేడింగ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అమర్లపూడి శరత్, పుల్లారావు, తాటి రాజు, బత్తినేని శ్రీనివాసరావు, ఎన్వీ రమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి

నాణ్యమైన విద్యతో భవిష్యత్ ఉన్నతం

▸ కాంగ్రెస్ నాయకుడు దయాకరరెడ్డి, డీపీఎస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి

▸ నూతనభవనంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్ అంతా తరగతి గదిలోనే ఆధారపడి ఉందని, ఎంత నాణ్యమైన విద్యను అందిస్తే విద్యార్థుల భవిష్యత్ అంత ఉన్నతంగా ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకరరెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని గోపాలపురంలో అంతర్జాతీయప్రమాణాలతో నూతన భవనంలో ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమానికి తుంబూరు దయాకరరెడ్డి, పాఠశాల డైరెక్టర్ రవీంద్రరెడ్డి హాజరయ్యారు. పాఠశాలను ప్రారంభించి మాట్లాడారు. నిర్బంధ విద్యకు పూర్తిగా వ్యతిరేకమని, విలువలతోకూడిన విద్యను అందించడానికి మా ఉపాధ్యాయ బృందం ఎప్పటికి కృషి చేస్తుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రణధీర్ మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా పాఠశాల పురోగతికి కృషిచేస్తామని, భవిష్యత్తులో అత్యున్నత ఫలితాలు అందిస్తామన్నారు.



పాఠశాలను ప్రారంభిస్తున్న దయాకరరెడ్డి, పాఠశాల డైరెక్టర్ రవీందర్‌రెడ్డి